ప్రజాశక్తి
సోపతి
డిసెంబర్ 07, 2014 ఆదివారం అనుబంధం

నవీన నగల శైలి ప్లాటినం



చేతి రాతల సృజనకోణాలు

- కూర చిదంబరం కథ
- మతోన్మాదం పుట్టుక, నివారణపై సమీక్ష
- తెలంగాణ తొలి తెలుగు పత్రికలు
- సాహిత్య ప్రకాష్, బండి సత్యనారాయణ కవితలు



లౌకిక పార్శ్వాల ఆవిష్కరణ

తెలుగు చిత్రకళా ప్రపంచంలో అరుదయిన సృజనశీలి పాకాల తిరుమల్‌రెడ్డి. పి.టి.రెడ్డి (1915–1996)గా ప్రసిద్ధులైన వారి చిత్రకళా ప్రపంచం వైవిధ్యమైంది. బొంబాయి స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో చదువుకుని ప్రసిద్ధి చెందిన తెలంగాణ చిత్రకారుల్లో పి.టి.రెడ్డి ప్రముఖులు. వారి చిత్రశైలుల మీద రియలిజంతోపాటు పోస్టు ఇంప్రెషనిజం ప్రభావాలున్నాయి. భారతీయ తత్వచింతనకు సంబంధించిన భావనా పరంపర వారి బొమ్మల్లో, శిల్పాల్లో నర్మగర్భితంగా వుంటుంది. ఆధునిక చిత్రకళా రంగం బహుళ పార్శ్వాలు పి.టి.రెడ్డి చిత్రాల్లో ప్రతిఫలిస్తాయి. ఇక్కడ కనిపిస్తున్న బొమ్మల్లో వాటి విన్యాసరేఖల్ని చూడొచ్చు. భారతీయ చిత్రకళా సంప్రదాయల్ని, పాశ్చాత్య చిత్రకళా సిద్ధాంతాల్ని అధ్యయనం చేశారాయన. ఈ క్రమాన తనదైన శైలిని రూపొందించుకున్నారు. ఇంప్రెషనిజం, క్యూబిజం, అబ్‌స్ట్రాక్ట్, తాంత్రిక్ రీతుల్ని నిశితంగా అధ్యయనం చేస్తూ, భారతీయమైన శైలిని, సంవిధానాన్ని రూపొందించుకున్నారు. మతాన్ని, సంప్రదాయాల్ని అర్థం చేసుకుంటూనే సామాజిక, లౌకిక కోణాల ఆవిష్కరణ కారణంగా భారతీయ చిత్రకళా ప్రపంచంలో ఆయనది ప్రత్యేకస్థానం. హైదరాబాద్ నారాయణగూడలో వారి ఇల్లే ఒక గ్యాలరీగా వుండి, ఎందరో సాహిత్య కళాభిమానుల్ని అలరిస్తుండేది. 1980, 90ల కాలంలో హైదరాబాద్‌కు వచ్చే ఎందరో చిత్రకారులకు, సాహిత్యాభిమానులకు, కళాకారులకు దర్శనీయ స్థలం అది.

'ద హండ్రెడ్ ఫీట్ జర్నీ'లోని దృశ్యం

అవలోకనం

కాలం ఒక ప్రవాహం. రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచిపోతుంటాయి. చూస్తుండగానే కాలం పరిగెడుతుంటుంది. 2014లో చివరిదశకు వచ్చాం. డిసెంబర్ ఈ ఏడాది ఆఖరు మాసం. క్యాలెండర్ మరలిపోవడానికి ఎక్కువరోజులు లేవు. కానీ ఈ ఏడాది ఏం చేశారు? ఎలా జీవించారు? జీవితంలో ఏమైనా మార్పు వుందా? ఎవరికైనా మేలు చేశారా? మీ బతుకు మీకు సంతృప్తిగానే వున్నదా? మీ కోసం మీరు చేసుకోడం కాదు, పరులకోసం ఏమైనా చేశారా? ఒకసారి అవలోకించండి. ఆలోచించండి. ఇప్పటికే పశ్చాత్తాపాలు, చేయాలనుకొని చేయలేకపోయిన విషయాలపై విచారాలు మనసులో మొదలయి వుంటాయి. మీ సాఫల్య వైఫల్యాల గురించి ఆలోచించుకోవాల్సిన సందర్భమిది. బతుకులో కాస్తయినా మార్పు కనిపిస్తుందా? పదుగురికి ఉపకరించే పనులు ఏమైనా చేశారా? యోచించుకోవాలి.

మనకు సంబంధం లేకుండా కాలం దొర్లిపోతుంటుంది. ప్రవాహసదృశ్యమైన కాలంలో మన స్థానం ఏమిటన్న చింతన అవసరం. నిజానికి కాలానికి ప్రత్యేకమైన విలువ లేదు. ఆ విలువను ఆపాదించేది మనుషులే. అంతమాత్రాన కాల గమనాన్ని నిర్లక్ష్యం చేయక్కర్లేదు. కనీసం ఏడాదికొకసారి ఎవరికి వారు తమ గురించి తాము అంచనా వేసుకోవాల్సిన అవసరాన్ని చెప్పకనే క్యాలెండర్లు గుర్తు చేస్తున్నాయి. ఎంత సృజనాత్మకంగా బతికామో, బతుకునించి ఆశించిందేమిటో, లభించిందేమిలో చూసుకోవాలి. సమాజంలో తమ పాత్రకు గల స్థానం గురించి పరిశీలించుకోవాలి. ఇతరుల పట్ల దయ కనబరిచిన సందర్భాలు ఏమిటి? క్రూరంగా ప్రవర్తించిన సంఘటనలేమిటి? అన్యాయాన్ని నిర్భయంగా నిలదీసిన క్షణాలేమిటి? నిండైన ఆత్మాభిమానం ప్రదర్శించిన సన్నివేశాలేమిటి? ఈవిధంగా ప్రశ్నించుకోవాలి. ఈ ప్రశ్నలకు సమాధానాలను ఒక నోట్‌బుక్‌లో రాసుకోవాలి.

చేరుకున్న లక్ష్యాలు, చేరుకోలేకపోయిన మైలురాళ్ళు గుర్తు చేసుకోవాలి. నడిచివచ్చిన దారుల్ని పరికించాలి. అడుగుజాడలు చెబుతున్న పాఠాలేమిటో గ్రహించాలి. విమర్శ, ఆత్మవిమర్శలు ప్రతిదశలోనూ అవసరం. కనీసం ఈ ఏడాది చివరలోనైనా ఆ దిశగా చూపు సారించాలి. మీలోకి మీరు చూసుకొని, మంచీచెడుల్ని బేరీజు వేసుకోవాలి. ప్రపంచం పట్ల మరింత మానవీయంగా వ్యవహరించడానికి ప్రయత్నించాలి. ఈరకంగా ఆత్మావలోకనానికి అనువైన సమయమిది. మరల కొత్తశక్తితో ముందుకు ప్రయాణించడానికి, రానున్న కాలంలో నిర్ణయాత్మకంగా వ్యవహరించడానికి ఇది ఉపయుక్తం.

వెంటాడే వాక్యం

తాను విశ్వసించి కృషి చేసే ఆదర్శానికి ప్రమాదం వచ్చినపుడు నిజాయితీపరులు ప్రతిఘటిస్తారు. ద్రోహులు బయటపడతారు. వీరులు పోరాడుతారు. బలహీనులు దిగజారిపోతారు. – జూలియస్ ఫ్యూజిక్

ప్రజాశక్తి సోపతి

డిసెంబర్ 7, 2014

లేఖలు 4

ఆ పాత మధురాలు శ్రమైక జీవన గీతం 5

కవర్‌స్టోరీ

చేతిరాతల సృజన కోణాలు 6

ఇంటర్వ్యూ దర్శకత్వం ఇష్టం 9

కథ

మారిన విలువలు 10

స్ఫూర్తినిచ్చిన గురువు 11

మరపురాని అనుభవం యుద్ధవార్తల రిపోర్టింగులో 13

నెమలీక 14

సీరియల్ ప్రేమ - విప్లవం 16

అలనాటి పత్రికలు

తెలంగాణ తొలి తెలుగు పత్రికలు

శేద్యచంద్రిక, హితబోధిని 18

సంగీతం గ'మ్మత్తై'న గాత్రధారి 19

సృజన నవీన నగల శైలి ప్లాటినం 20

జ్యువెలరీ గ్రీటింగ్ కార్డులు 22

సోర్స్‌కోడ్ ఒపెరాతో వేగవంతమైన బ్రౌజింగ్ 23

సమీక్షలు

జీవన విధానంగా లౌకికవాదం 24

ఈ వారం కవిత్వం

ఒక తడిగీతం 26



చేయితో రాయడం అరుదయిపోయిన నేటి కాలాన, ఒక జ్ఞాపకంగా నిలిచిపోయే చేతిరాతల అవసరాన్ని, వాటిలోని సృజనకోణాల్ని వ్యక్తీకరించే ముఖచిత్ర కథనమిది.

లేఖలు



అందరికీ చోటు

కవర్‌స్టోరీలో వచ్చిన 'చిత్రకథ కేరాఫ్ తెలంగాణ' వ్యాసం ఆకట్టుకుంది. ఒక ప్రాంతానికి, అక్కడి ప్రజల జీవన శైలిని చిత్రకళ ప్రతిబింబిస్తుంది. చిత్రకళ అనగానే ఎగ్జిబిషన్‌లోని చిత్రాలే గుర్తొస్తాయి. అయితే అవి మాత్రమే చిత్రాలు కావు. పిల్లల పుస్తకాలు మొదలుకుని అనేక రకాల దిన, వార, పక్ష, మాస, త్రైమాస పత్రికలు, పాఠశాల విద్యార్థుల పాఠ్యపుస్తకాలు వున్నాయి. వాటిల్లో ఎంతో వైవిధ్యమైన చిత్రాలను వేసే వారందరూ చిత్రకారులే. ఇటీవల తెలంగాణలో విడుదలైన 'ఆర్ట్ ఎట్ తెలంగాణ' పుస్తకంలో ఎంతోమంది చిత్రకారుల చిత్రాలున్నా, ఇంకా కొంతమంది చిత్రాలు అందులో లేవు. కానీ అందులో తెలంగాణ చిత్రకారులందరికీ చోటిస్తే బాగుండేది అనిపించింది.

– వేణుగోపాల్, పాల్వంచ

అసలైన స్వచ్ఛ భారత్

సోపతిలో వచ్చిన 'స్వచ్ఛే జనా సుఖినోభవంతు' చాలా బాగుంది. నిజంగా స్వచ్ఛ భారత్ అంటే వీధిలో చెత్త ఊడవడం కాదు. దేశంలో ఉన్న అవినీతిని, లంచగొండి పరులను, మహిళాపై దాడిలు చేసే వాళ్ల లేకుండా చేయాలనే నీతిని చిన్న కథ రూపంలో రాసి ప్రజల్లో ఆలోచన కలిగే విధంగా రాశారు.

– పల్లవి, హైదరాబాద్

తెలుగులో వస్తే...

నిజాం గజళ్ళ పరిచయంలో ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ కవిత్వం గురించి ఇచ్చారు. నిజంగా ఒక నిజాం ఇంత అద్భుతంగా కవిత్వలు రాయగలరా అనిపించింది. నిజాం లోని కొత్త కోణాన్ని పాఠకులకు పరిచయం చేశారు. నిజాం గజళ్ళు తెలుగులో అనువదిస్తే చదవాలనే కోరిక కలిగేలా ఉంది.

– రాహుల్, హైదరాబాద్

తెలుసుకోడానికైనా చూస్తాం

సోర్స్‌కోడ్‌లో కొత్తకొత్త వెబ్‌సైట్‌ల గురించి ఇస్తున్నారు. ఫోన్ అంటే కేవలం మాట్లాడుకోవడానికే అనుకునే మాలాంటి వారికి ఈ శీర్షికలు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. ప్రతి వారం ఒక కొత్త వెబ్‌సైట్ గురించి తెలుసుకోడానికైనా సోపతి చూస్తాం.

– అశోక్, రంగారెడ్డి జిల్లా

శాస్త్రీయంగా ఆలోచించాలి

అంతరంగంలో చెప్పిన శాస్త్రీయ దృక్పథం వ్యాసం వివరణ బాగుంది. ప్రతి మనిషీ జీవన ప్రమాణాల్ని పెంచుకోవాలంటే శాస్త్రీయంగా ఆలోచించడం తప్పనిసరి. కానీ నేటి మార్కెట్ శక్తులు ఆ దిశగా ఆలోచించనివ్వకుండా వినియోగదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అలాగే రాజకీయ నాయకులు కూడా ఎన్నికలప్పుడు మాత్రమే జనం దగ్గరకు వచ్చి తమ వాగ్ధాటితో సరైన తీరిలో ప్రజలను ఆలోచించనివ్వకుండా చేస్తున్నారు. ఎందుకు?, ఏమిటి? అనే ప్రశ్నలతో శాస్త్రీయంగా ఆలోచించినప్పుడే జీవితం ఉన్నతంగా ఉంటుందని ఈ వ్యాసంలో చెప్పకనే చెప్పారు.

– గోపీనాథ్, మహబూబ్‌నగర్

మన జాతీయాలు

మోచేయి విచారం

మోచేయి నేలకానించి అరచేయితో తలపెట్టి విచారించటం సహజంగా అందరూ చేసేది. మేజాబల్ల వుంటే దానిపైన మోచేయి మోపి అరచేతిలో చుబుకం ఆనించి తమ సమస్యకు జవాబు వెదుకుట మానవనైజం. భాషా, ప్రాంతం అనేది లేకుండా ప్రపంచమంతటా వున్న మానవ జన్మ సహజ పద్ధతిది. కొందరు తమకెంత తెలిసినా పదుగురితో విచారిస్తారు. తమ కన్న పెద్దవారితో, తమకంటె చిన్నవారితో, ఏమీ ఎరుగని వారితో కూడా విచారిస్తారు. అయ్యా మీ కన్న ఎక్కువ మాకేం తెలుసు, మీరు మమ్మల్ని అడిగితే మేమేం చెప్పగలం, మీరు మాకు చెప్పేవారు మీకు మేం ఏం చెబుతామని ఆశ్చర్యంతో చిన్నవాళ్ళు జవాబు చెబుతారు. అందుకు ప్రతిగా "ఎవరిది వారికి తోచదు. మోచేయి విచారమన్నా చేయకుండా తొందరపాటుతో చేసే పనులు ఎంతో దెబ్బతీస్తాయి" అనటంలో ఈ జాతీయం ప్రస్తావన వుంది.

శేరుకు సవ్వాసేరు

ఎనభై తులాలకొక శేరు. నైజాం కాలంలో వున్న కొలమానం. సవ్వా అంటే పాతిక. నాల్గవ భాగం అని అర్థం. సవ్వాశేరు అంటే శేరుంపావు లేదా శేరుంబాతిక. ఒకరు శేరంటే మిగిలినవారు సవ్వాశేరనుట. ఒకరిని మించి ఒకరు అనుట ఈ జాతీయ భావార్థం. "వాడు గొప్పవాడని నీవనుకుంటున్నవు. వీడు శేరుకు సవ్వాశేరు వానికంటే ఘనుడు" అనటంలో ఈ జాతీయం వాడుతారు.

కూతెల్లదు

కూత వెలువడదు. నోటినుండి మాటరాదు అనుట. "ఇంటి కాడ పెద్ద ప్రగల్భాలు పలికాడు. ఉత్తర కుమార ప్రజ్ఞలు చెప్పాడు. వేదిక ఎక్కిన తర్వాత కూతెల్లలేదు. చెమటలు పోసి మేమే అని కిందికి దిగాడు" అని చెప్పడంలో ఈ జాతీయం వాడుకలోకి వచ్చింది.

చెట్టు కింద గడ్డి

ఒకరి పంచన బతికేవారు, బలహీనులు. చెట్ల కింద గడ్డి మొలవటం తక్కువే. కొన్ని చెట్ల కింద మొలుస్తుంది. దాంతో ఉపయోగం లేదు. పెంపు కాదు. సూర్యరశ్మి, నీరు, గాలి ధారాళంగా లభించదు. వ్యాధిగ్రస్తుడై మంచం పట్టినవాని వలె చావకుండా పుట్టినందుకు నేనో ప్రాణినన్నట్లుగా వుంటుంది. కాత, పూత అయితే వుండనే వుండదు. బతకలేక చావలేక వున్న పరిస్థితి. "నీకిప్పుడే వయసొచ్చింది. చెట్టు కింద గడ్డితీరు తల్లితండ్రి పెడితే తినేవానివి పైసా సంపాదన లేదు. పదహారేండ్లకే నేను ప్రేమించానంటే ఎట్లా. సంసారమంటె ఏమనుకున్నవు" అనటంలో ఈ జాతీయం ప్రయోగం చూడొచ్చు.

– వేముల పెరుమాళ్ళు

■ ఆ పాత మధురాలు

శ్రమైక జీవన గీతం

అది 1957వ సంవత్సరం. "తోడు కోడళ్ళు" చిత్రం విడుదలైన సంవత్సరం. అప్పుడు నా వయసు 3 సంవత్సరాలే. నేను ఈ సినిమాను నా 12వ ఏట చూసాను. ఆ చిత్రంలో ఈ పాట...

"కారులో షికారుకెళ్ళే పాలబుగ్గల పసిడిదాన
బుగ్గ మీద గులాబి రంగు ఎలా వచ్చెనో చెప్పగలవా"

రేడియోలో అనేక వందలసార్లు ప్రసారమైంది. ఈ పాట వచ్చినప్పుడు నాలో ఏదో తెలియని భావానందం కలిగేది. ఒక విచిత్రమైన మానసిక వ్యవస్థకు లోనయ్యేవాణ్ణి.

నేను యుక్త వయస్సుకి వచ్చేసరికి అభ్యుదయ భావాల ప్రేరణలో ఈ పాట ఎంతగానో ప్రభావం చూపింది. నన్నే కాదు ఆనాటి యువతను కూడా ప్రభావితం చేసిందనే చెప్పాలి.

విషాద జీవితశ్రమ నుండి వచ్చిన ఫలితాలే కొంతమంది గొప్పింటి బిడ్డలకు సౌఖ్యంగా మారిందనే సత్యానికి ఆ నాటి సమాజ అసమానతలకు ఈ పాట అద్దం పట్టింది. విలాస వంతమైన జీవితం వెనుక కన్నీరొలికే కష్టజీవుల చిత్రమైన జీవితం వుందని ఈ పాట చెబుతుంది.

భాగ్యవంతుల విలాసగ్రస్తమైన జీవన యానాన్ని, ఆ విలాసాల వెనుక వున్న కోట్లాది మంది కష్టజీవుల కష్టాలను ఈ పాటలో సమ్మిళితం చేయడం కవి చాతుర్యానికి తార్కాణం.

చాలా సరళంగా, సూటిగా పెద్దింటి బిడ్డను ప్రశ్నించడంలో కవి రాసిన పదబంధం మనలను కట్టిపడేస్తుంది.

జమీందారి అమ్మాయి బుగ్గల మీద గులాబి రంగు ఎలా వచ్చిందంటే... ఆమెను మించిన అందగత్తెలు మండిపోయే ఎండల్లో మగ్గిపోగా వారి బుగ్గల నిగ్గు వీళ్ళకు వచ్చిందని కవి చమత్కరిస్తాడు.

ఇంద్రభవంతులలో కులుకుతున్న ఓ అమ్మాయీ... నీ మేడలో పరిచిన చలువరాయి చల్లదనం, ఆ రాయిని వొళ్ళు విరుచుకొని గనుల నుండి వెలికి తీసిన గని శ్రామికుల చెమటలో తడిసి చల్ల బడిందని గుండెను తాకే విధంగా కవి తెలియజేస్తాడు.

గాలిలో తేలిపోయే చీర ధరించిన చిన్నదాన, ఆ చీరలో జిలుగు వెలుగుకు మురిసిపోతున్నావు, ఆ చీర ధగధగలు చితికిన బతుకులతో నేసిన నేతగాళ్ళ బరువు బ్రతుకుందని చక్కగా సంబోధిస్తాడు కవి.

ఇలా బరువు బతుకుతో చిందే చెమట చాకిరితో సృష్టించిన సంపద కొందరు మాత్రమే అనుభవించే ఈ సౌఖ్యం ఇకపై సాగదని నిష్కర్షగా హెచ్చరిస్తాడు కవి.

ఈ విధమైన శైలి ఎవరిదంటే వెంటనే శ్రీశ్రీ అని ఎందరో కరాఖండీగా చెబుతారు. కాని మన ఊహలకందని మనసు కవి ఈ పాట రచయిత అంటే నివ్వెరపోతారు.

మనసు మీద, ప్రేమ మీద, ప్రియురాలి మీద మనసు పడేసుకొని ఎన్నో విరహ గీతాలు రాసిన అతగాడే ఈ పాట రాశారని తెలిస్తే అవాక్కై పోతారు.

అతడే సుకవి, మనసుకవి ఆత్రేయ. ఈ పాటకు చక్కటి పొందికైన బాణీ కట్టి స్వర పరిచింది సుప్రసిద్ధ సంగీత దర్శకుడు మాస్టర్ వేణు కాగా, తన గానామృతాన్ని అలవోకగా అందించినవారు ఘంటశాల వెంకటేశ్వరావు.

ఈ ముగ్గురు మూర్తులకు జోహార్లు అర్పిద్దాం.

పాట

కారులో షికారు కెళ్ళే పాలబుగ్గల పసిడిదాన
బుగ్గమీద గులాబి రంగు ఎలా వచ్చెనో చెప్పగలవా

నిన్ను మించిన కన్నెలెందరో మండుటెండలో మాడిపోతే
వారి బుగ్గల నిగ్గునీకు వచ్చిచేరెను, తెలుసుకో "కారులో"



చలువరాతి మేడలోన కులుకుతావే కుర్రదానా
మేడకట్టిన చలువరాయి ఎలా వచ్చెనో చెప్పగలవా

కడుపు కాలే కష్టజీవులు ఒడలు విరిచి గనులు తొలిచి
చమట చలువను చేర్చి రాళ్ళను తీర్చినారు తెలుసుకో
కారులో షికారు కెళ్ళే పాలబుగ్గల పసిడిదాన
నిలిచి విను నీ బడాయి చాలు తెలుసుకో ఈ నిజానిజాలు

గాలిలోన తేలిపోయే చీర గట్టిన చిన్నదాన
జిలుగు వెలుగుల చీర శిల్పం ఎలా వచ్చెనో చెప్పగలవా
చిరుగు పాతల బరువు బ్రతుకుల నేతగాళ్ళే నేసినారు "చిరుగు"

చాకిరొకరిది, సౌఖ్య మొకరిది సాగదింక తెలుసుకో
కారులో షికారు కెళ్ళే పాలబుగ్గల పసిడిదాన
నిలిచి విను నీ బడాయి చాలు, తెలుసుకో ఈ నిజానిజాలు.

- పిఎన్ మూర్తి. 9441151762

■ కవర్ స్టోరీ

చేతి రాతల సృజన కోణాలు

కురిసే చిరుజల్లును... విరిసే హరివిల్లునూ, వికసించే పువ్వునూ మీరెప్పుడైనా పరిశీలించారా? ఆ దృశ్యాన్ని వీక్షించడంలోని ఆనందమే వేరు. ప్రత్యక్షంగా చూసినప్పుడు కలిగే హృదయ స్పందన భావుకతను అక్షరాలుగా పేర్చినప్పుడు... అందులోని అనుభూతి మరెందులోనూ ఉండదేమో...! మనసులోని ఊహలు.. మధురమైన ఊసులు... కాగితం పట్టినప్పుడు.. కలం కదిలినప్పుడు జాలువారు జలపాతాలే విరబూసే భావ కుసుమాలు. నేడు అవి కాస్తా... వాడిపోతున్నాయి.

బుజ్జీ! ఎలా ఉన్నావ్‌రా? సెలయేటి గలగలల్లా నీ మాటలు వింటున్నా, విరబూసే నీ నవ్వుల్ని చూస్తున్నా... నిన్ను చూడాలన్న ఆశ ఆవిరైపోదు. నిన్ను చేరాలన్న గమ్యం కనుమరుగై పోదుకదా...! ఆ రాతలో... ఆ మాటలో... ఆ భాషలో... ఓ రసికతా... ఓ భావుకతా... ఓ కళానైపుణ్యం ఇమిడి ఉంది. ప్రేమ, అనురాగం ఆప్యాయత ఉట్టి పడుతుంది. మనుష్యుల మధ్య సాన్నిహిత్యం పెరుగుతుంది. స్నేహబంధం ముడిపడుతుంది. అంటే మానవ సంబంధాలు బలపడటంలో భాషాపరిజ్ఞానం, వాక్య నిర్మాణం ఆసక్తి రేకెత్తించగలిగే శైలి ప్రవహిస్తుంది.

ఏ విషయాన్నయినా, సమగ్రంగా అధ్యయనం చేయడానికి అర్థం చేసుకోవడానికి అందమైన చేతిరాత, అందమైన భాష, అందమైన పదకూర్పు ఎంతో అవసరం. కాని నేటి యువతలో అది కొరవడుతుంది.

ఆయుధశక్తి కన్నా అక్షరశక్తి మిన్న. అందుకు చదువు నేర్చిన సమాజం చకాచకా అడుగులు వేస్తోంది. ప్రపంచ పోకడలను పుణికి పుచ్చుకుంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే అక్షరమే జనజీవన ఆత్మ. ఈ సమాజం పోకడలపై మీ మదిలో మొగ్గ తొడిగే భావాలను పదుగురికి చేరవేయడానికి అక్షర దండలు అల్లక తప్పదు. ఏ భావమైనా, సమాచారమైనా, పరిజ్ఞానమైనా పరివ్యాప్తి కావాలంటే అక్షరరూపం తొడగాల్సిందే. ప్రియురాలికి రాసిన ప్రేమలేఖ నుంచి పోటీ పరీక్షల దాకా, యదార్థ జీవిత సత్యాల నుంచి కల్పిత కథలదాకా, అల్లం మురబ్బా నుంచి అంతరిక్ష సమాచారం దాకా సమస్తం అక్షరాల వంతెనలపై నడిచి వస్తాయి. మన ముగింట నిలుస్తాయి. మనో పరిధిని విస్తరింపజేస్తాయి. సమాచారరంగం వడివడిగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతోంది. పత్రికలు, ఎఫ్.ఎం రేడియోలు, టీవీ చానెళ్లు రోజుకొక్కటిగా వెలుస్తున్నాయి. కనిపించే, వినిపించే మాధ్యమాలలో సైతం అక్షర విన్యాసాలు తప్పడం లేదు. ఈ మాధ్యమాలకు అక్షర శిల్పుల అవసరం రోజురోజుకూ పెరుగుతోంది.

ఎదుటివారికి సులభంగా, అర్థమయ్యేలా విడమరచి మాట్లాడే మనమే... ఆ భావాలను కాగితంపై పెట్టే సరికి నానా ప్రయాసపడిపోతాం. కలం కదలదు. అనుకున్న భావం రూపు తొడగదు. తీరా కష్టపడి రాసినా అసంతృప్తి వెన్నాడుతూనే ఉంటుంది. రాయడమే వృత్తిగా కలిగిన వారికి

చేతిరాత ఓ జ్ఞాపకం

చేతిరాత అరుదయిపోతున్న కాలంలో ఉన్నాం. కలం కన్నా కీ బోర్డు వాడకం పెరిగింది. సంతకాల్ని సైతం స్కాన్ చేసి పంపించే టెక్నాలజీ వచ్చింది. అంతేగాక కవులు, రచయితలు సైతం కంప్యూటర్ కీబోర్డు మీద యూనికోడ్ ఆధారంగా తెలుగులో రచనలు చేస్తున్నారు. కొత్తతరం కవులు అనేకమంది కవిత్వం సృజించినా, కథ రాసినా కీబోర్డును వాడుతున్నారు. ఒక అద్భుతమైన కవిత చదువుతాం. కానీ వారి చేతిరాత ఎలా ఉంటుందో మనకు తెలియదు.

గతంలో ఇస్మాయిల్, అజంతా లాంటి కవులు కవిత పంపితే వారి చేతిరాతలోనే యథాతథంగా పత్రికల్లో అచ్చువేసిన సందర్భాలున్నాయి. వారి కవిత్వం మీద, వారి మీద ఉన్న గౌరవానికి సంకేతమది. కవులు, రచయితలందరూ కీబోర్డును ఆశ్రయించలేదు. కవి శివారెడ్డి ఒకటికి రెండుసార్లు కవిత్వాన్ని కాగితం మీద రాసి, ఫెయిర్ చేసి పంపిస్తుంటారు. అనంతపురం నుంచి బండి నారాయణ స్వామి చేత్తోనే కథలు రాస్తున్నారు. ఆంగ్ల సాహిత్యాన్ని విపరీతంగా చదివి, ప్రతి ఏటా నోబెల్ సాహిత్య పురస్కారం ప్రకటించగానే వారి గురించి వ్యాసాన్ని సృజించే కె.సదాశివరావు చేత్తోనే సైన్స్‌ఫిక్షన్ కథలు రాస్తున్నారు. ఈ నడుమ సుంకర రమాదేవి అనే అధ్యాపకురాలు భారత రాజ్యాంగం – రాజకీయ వ్యవస్థ మీద 1600 పేజీల పుస్తకాన్ని చేత్తోనే రాశారు.

అమృతా ప్రీతమ్

ఇప్పుడు మనం శ్రీశ్రీ, చలం ఉత్తరాల్ని అపురూపంగా చూసుకున్నట్టుగానే రానున్న తరం తమ అమ్మమ్మల, తాతయ్యల, అమ్మల, నాన్నల రాతల్ని అపురూపంగా చూసుకునే రోజులు వస్తాయి. ఒద్దిరాజు సోదరులు చేసిన అనువాదాలు, నాటకాలు, కథలకు సంబంధించిన చేతిరాత ప్రతుల్ని ఇప్పటికీ వారి కుటుంబీకులు, బంధువులు భద్రంగా దాచి వుంచారు. 330 పేజీల 'నౌకాభంగం' (రవీంద్రనాథ్ టాగూర్ 'ది రెక్' నవలకు అనువాదం) నవలను 1948 ఆగస్టులో అనువాదం చేయగా ఇటీవల మొదటిసారి అచ్చువేశారు.

గురజాడ డైరీల్ని, సామల సదాశివ ఉత్తరాల్ని, భగత్‌సింగ్ రచనల్ని, అమృతాప్రీతమ్ చేసిన రచనల చేతిరాత ప్రతుల్ని చూస్తే ఎంతో అబ్బురమనిపిస్తుంది. ఇలాంటి అబ్బురానికీ, విస్మయానికీ లోను చేసే శక్తి చేతిరాత ప్రతులకు ఉంది. కనుక పిల్లలు చిన్నప్పుడు స్కూల్ దశలో రాసిన చూచిరాత కాపీల్ని భద్రంగా దాచి వుంచండి. రేపు పెద్దయ్యాక వారు చూసుకుంటే ఆశ్చర్యపోతారు. మీ అమ్మాయి స్కూల్‌దశలో రాసిన కవితనో, వ్యాసాన్నో భద్రపరిస్తే ఆ ఆనందమే వేరు. కనుక చేతి రాత ప్రతుల విలువను గుర్తించండి. చేతిరాత అలవాటును కాపాడుకోండి. ఈతరంలో చాలామంది పత్రికా సంపాదకులు కీబోర్డుకు అలవాటు పడ్డారు. కానీ ఎందరో జర్నలిస్టులకు స్ఫూర్తిగా నిలిచిన ఏబికె ప్రసాద్ లాంటివారు వ్యాసాల్ని కాగితాల మీదనే రాసి పంపుతున్నారు. కీబోర్డు ఈతరం అవసరమయితే, చేతిరాత మనం పదిలపరుచుకునే జ్ఞాపకం. జ్ఞాపకాలు కూడా అవసరమే.



1948కి పూర్వం ఒద్దిరాజు సీతారామచంద్రరావు చేసిన గ్రామర్ బుక్ అనువాద లిఖితపత్రం

ఇది మరీ సమస్యగా పరిణమిస్తోంది. కాలంతో పరుగులు తీస్తూ, భావాలను అక్షరాల్లోకి మలిచే ప్రయత్నంలో ఎన్నో ప్రయాసలు. అలసిసొలసిన అక్షర శిల్పులను సేదతీర్చే ప్రయత్నమిది. చక్కగా రాయటం గురించి, వార్తాసేకరణ, వార్తా రచనల గురించి తెలియచెప్పే చిరు ప్రయత్నమిది.



గాంధీ చేతిరాత



రవీంద్రనాథ్ టాగూర్ చేతిరాత

చక్కగా రాయట ఎలా?

ఈ ప్రశ్నకు అంత తేలిగ్గా సమాధానం లభించదు. దీనికి సరళమైన సమాధానం కూడా ఉండదు. చిన్నప్పుడు మన టీచర్లు 'పేరాగ్రాఫులు విడగొట్టండిరా, ఫుల్‌స్టాపులు, కామాలు పెట్టండ్రా' అన్నప్పుడే 'రాయడం ఎలా?' అన్న ప్రశ్న గురించి మనం ఆలోచించాం. ఆ తర్వాత నాలుగో తరగతిలోకి రాగానే, కొద్దిగా వ్యాకరణ సూత్రాలు నేర్చుకున్నప్పుడు చక్కగా రాయటం గురించి మూల సూత్రాలు తెలుసుకున్నాం. ఇక పాఠశాల బయటి విషయానికొస్తే, మనలో చాలా మంది చిన్నప్పుడే స్నేహితులకు బంధువులకు ఉత్తరాలు రాసే వాళ్ళం. పోస్టుకార్డుల్లో క్లుప్తంగా రాసే వాళ్ళం.

ఒక దశలో మనం నేర్చుకున్న మొదటి పాఠం ఏమిటంటే – రాయటంలో సరదా, సంతృప్తి, ఆనందం ఉన్నా రాయటం అంత తేలికైన పనేమి కాదు. రాయడం అన్నది ఒక్కోసారి మనల్ని మహా కలవర పరుస్తుంది కూడా. 'రాయడమంటే మాటలు కాదు, టేబుల్ ముందు కూర్చొని కలం పట్టుకొని నరాలు తెగేలా ఆలోచించాలి' అన్నారొక రచయిత. ఇంతకూ ఆ రచయిత చెప్పదల్చుకున్న దేమిటంటే – రాయటం కష్టమైన పనే కాదు. రచనకు అంకిత స్వభావం కూడా అవసరం. రాసినంతసేపు రచనకు పంచేంద్రియాలను అంకితం చేయాల్సిందే. రాస్తున్నప్పుడు మనం

ఇతర విషయాల గురించి బొత్తిగా ఆలోచించలేం. ఏ ఇతర పనీ చేయలేం. రచించడంపై సర్వశక్తులనూ కేంద్రీకరించాల్సిందే. అతిశయోక్తిగా కనిపించొచ్చుగాని, రచన తపస్సు లాంటిది. ఏకాగ్రత సాధించలేని వాడు రచనకు శ్రీకారం చుట్టలేడు.

ఒక ప్రేమ మాటలో పలకాలంటే గుండె గొంతుకలో కొట్లాడాలి. మనసుకు అనువదిస్తే... తప్ప భాష బాసగా మారదు. విరామ చిహ్నం దాకా ఎడతెగని ప్రయాణమే అనుకుంటే కష్టం వంతెన తెగిపోవచ్చు, వాగు ఇంకి పోవచ్చు. ఒక్కొక్కసారి అనుకున్న అక్షరం గడిలో ఇమడదు. ఆశించిన అర్థంతో పదం కాపురం చెయ్యదు. పేనుకున్న తాడు తెగి పోతుంది.

ముడివేస్తే... స్పష్టంగా కనబడుతుంది. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొని ఎంపిక చేసుకున్న పదాలను దారంలో పూలలా ఎలా అందంగా గుది గుచ్చాలి? రాసిందేదో స్పష్టంగా ఉండాలి. సరళంగా ఉండాలి. సుబోధకంగా ఉండాలి. రచనలో అనవసర అంశాలను చేర్చనేకూడదు. మీరనుకున్న సమాచారాన్ని, భావాన్ని లేక అనుభూతిని నేరుగా పాఠకుడికి అందించాలి. మధ్యలో మరో వ్యాఖ్యాత అవసరం ఉండకూడదు. అతిశయోక్తులు పాఠకుడి అవగాహనకు ఒక్కోసారి ఆటంకంగా తయారవుతాయి. మాటలతో పాటు బొమ్మల్ని చిత్రించి పాఠకుడి కళ్ల ముందుంచాలి.

మంచి రచనలో పదాలు ఎప్పుడూ కనీస సంఖ్యలో ఉంటాయి. అనవసర పదాలు ఉపయోగించి పాఠకుడి సమయాన్ని హరించే హక్కు రచయితకు లేదు. కవిత్వంలోనూ, నిజ జీవితంలోనూ "ఎకనామి ఆఫ్ వర్డ్ అండ్ థాట్" లేక పోవడం దేశభక్తి కన్న హీనమైన పాపం అంటాడు చలం. మహా ప్రస్థానానికి రాసిన పరిచయంలో ఈ సూక్తి అన్ని రకాల రచనలకూ వర్తిస్తుంది.

మంచి రచన అంటే... చెప్పదలచుకున్నది మాత్రమే చెప్పాలి. ఏ పదాలు ఏ అర్థాన్ని ఇస్తాయో తెలుసుకుని వాటినే వాడాలి. నిర్లక్ష్యంగా, నిష్కారణంగా మాటలను ఒలకబోయకూడదు. మోతాదుకు మించి ఔషధం పుచ్చుకుంటే ఫలితం లభించదు. అలాగే పదాలను అనవసరంగా వాడినా ఆశించిన ఫలం దక్కదు. స్ఫటికంలా స్పష్టంగా ఉండాలి. పాఠకుడి మనసులో గందరగోళం సృష్టించ కూడదు. అనుకున్న అర్థాన్నే బట్వాడా చేయాలి.

మంచి రచనలో విశేష ఆకర్షణ బదులు వినమ్రత ఉంటుంది. పాఠకుణ్ణి తన వైపు లాక్కోకుండా, చేప్పే విషయంపై శ్రద్ధ వహించేలా ఉంటుంది. జ్ఞానాన్నే కాని అజ్ఞానాన్ని ప్రదర్శించదు. సందేశాన్ని సులువుగా గ్రహించగలిగేలా ఉండాలి. చదవడంలో గొప్ప ఆనందం ఉంటుంది.



రాయటంలో సరదా, సంతృప్తి, ఆనందం ఉన్నా రాయటం అంత తేలికైన పనేమి కాదు. రాయడం అన్నది ఒక్కోసారి మనల్ని మహా కలవర పరుస్తుంది కూడా. 'రాయడం మంటే మాటలు కాదు, టేబుల్ ముందు కూర్చొని కలం పట్టుకొని నరాలు తేగెలా ఆలోచించాలి'

ఒక్కో పుస్తకం చదువుతుంటే మనసు ఆహ్లాదంలో మునకలు వేస్తుంది. పంచేంద్రియాలు లగ్నం చేసి ఆనందంగా చదువుతుంటే పరిసరాలను పూర్తిగా మర్చిపోతాం. పరవశులమైపోతాం. పాఠకుణ్ణి ఆహ్లాద పరుస్తూనే ఆలోచింపజేయాలి. మార్పుకు దోహదపడాలి.

లేఖా సాహిత్యం

అలాంటి రచనలు కరువైనాయి. రాయడం ఆగిపోయింది. అంగీకి జేబులే కరువైనాయి. ఇంక పెన్ను కెక్కడిది చోటు! గల్లీ నుంచి ఢిల్లీ దాకా సెల్‌ఫోన్లు ముంచెత్తుతున్న నేపథ్యంలో – పత్తా లేకుండా పోయిన లేఖా సాహిత్యాన్ని నేతలు చిగురింపజేశారు. కొత్త ఆశలు రేకెత్తించారు. సిపిఎం నేత బివి రాఘవులు లేఖా సాహిత్యం పునరుత్థానానికి ఏకంగా వీర రాఘవ అవతారమే ఎత్తారు. సమకాలీన సమస్యలపై వందలాది ఉత్తరాలు రాశారు, రాస్తున్నారు. గత ఆరేళ్ళుగా కేంద్రం తల తిరిగేలా, ప్రజలు అదిరిపడేలా రాష్ట్ర సర్కారు విచ్చలవిడిగా భూకేటాయింపులకు పాల్పడటాన్ని ఆ లేఖలో తీవ్రంగా దుయ్యబట్టారు. దాదాపు 400 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని ఇష్టమైన వారికి చిత్త మొచ్చినట్టు కట్టబెట్టడాన్ని ఎండగట్టారు. సిగ్గూఎగ్గూ లేకుండా ఏకపక్షంగా ప్రజల పాలిట శాప పక్షంగా సాగిపోయిన భూ బదలాయింపులపై, అవినీతిపై సంయుక్త శాసనసభా విచారణ జరిపించాలని ఆ లేఖ ధర్మాగ్రహం వ్యక్తంచేసింది. తెలుగు సాహిత్యంలో శారద లేఖలు ఎంత గొప్పవో... సంజీవ్‌దేవ్ ఎడాపెడా రాసిన లేఖలు, యువరక్తాన్ని ఉరకలెత్తించిన ప్రేమ లేఖలు, రాజుల కాలంలో ఈ లేఖలు బట్వాడాకు ప్రత్యేకంగా కొందరు ఉద్యోగులు నియుక్తులయ్యేవారు. పోస్టల్‌శాఖ ఆవిర్భావానికి వారే ఆద్యులు, మార్క్స్ ఎంగెల్స్ ఉత్తరాలు, శ్రీశ్రీ, గాంధీ, నెహ్రూ ఉత్తరాలు చదివితే, ఉత్తరాలు ఎంత ప్రభావాన్ని చూపాయో అర్థమవుతుంది. సాంకేతిక పరిజ్ఞానం వెల్లువెత్తడంతో సామాజిక అభిరుచులు అష్టవంకర్లూ తిరిగి పోస్టల్ శాఖ సేవలు ఉపయోగించుకోవడం అరుదైంది. 'ఉభయకుశలోపరి'... అంటూ సందడి చేసే లేఖలు అరుదైన అడవి జీవాల మాదిరి ఎప్పుడో తప్ప కనిపించడం లేదు. జూపార్కులో సైతం జంతువులూ, పక్షులు మృత్యువాత పడుతున్న చందంగా లేఖా సాహిత్యమూ గుడ్లు తేలేస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో విష జ్వరాల్లా లేఖా సాహిత్యానికి ఏదో సోకింది. మనిషి లేఖలకందనంత నిరక్షరాస్యుడై పోతున్నాడు. ఒక్క ఉత్తరమైనా మనసును పలకరించని నాడు మనిషి అనాథకిందే లెక్క. బంధుమిత్రుల మనసులో మనకున్న చోటును తెలియజెప్పేవి ఒకప్పుడు ఉత్తరాలే. మహా రచయితల తొలిమజిలీ లేఖ లేనన్న నిజాన్ని మనం గ్రహించాలి. క్షణం తీరిక లేకుండా జీవితానికి సరిపడా ఉత్తరాలు రాసిన ఆంగ్ల కవి జాన్ కిట్స్ ఉన్నతంగా కనబడతాడు. సరోజినీ నాయుణ్ని పరిణతి చెందేలా చేసింది ఆర్థర్ సైమన్ జాబులే అంటే ఎవరూ కాదనలేరు. 'కనురెప్పలే కదా అని తేలిగ్గా తీసి పారేస్తే ప్రపంచాన్ని కనబడకుండా చేస్తాయి' అని హెచ్చరిస్తూ బాబూ రాజేంద్ర ప్రసాద్ రాసిన 1957 నాటి లేఖ అపురూపమైంది. లేఖ... పదునైన భావాల సాగు మనిషైనవాడి సిసలు రూపు రేఖలు... లేఖలు.

క్లుప్తత పాటించి రామాయణగాథపై ప్రజల్లో ఉన్న 'కట్టే, కొట్టే, తేచ్చే' నానుడిని గుర్తుచేశాడు. చరిత్ర గతిని మార్చే తరహా లేఖలు మళ్లీ వెల్లువెత్తాల్సి ఉంది. ప్రజా సమస్యలపై కలం వీరులుగా సృజించి, సమాజానికి సానుకూల సంకేతాలు ఇవ్వాల్సిన బాధ్యత గుర్తించకపోతే ఎలా?

– భూపతి వెంకటేశ్వర్లు,
ప్రజా సాంస్కృతిక కేంద్రం, 9490098343

■ **ఇంటర్వ్యూ**

ఎంతో మందికి పార్వతిగా, ప్రియగా సుపరిచితురాలైన సాక్షి తన్వర్ లాంటి ఉత్తమ కోడలు, పరిపూర్ణ భార్య ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. సీరియల్స్‌లో తన పాత్రలని బట్టి కాక సాక్షిగా తనని గుర్తుంచుకోవడం ఎంతో సంతోషంగా ఉంటుందని చెబుతున్న సాక్షిని అలాగే ఆదరిస్తున్నారు కూడా. దూరదర్శన్ ద్వారా 1990లలో యాంకర్‌గా కెరీర్ ప్రారంభించిన సాక్షి ఎన్నో సీరియల్స్‌లో, సినిమాలలో నటించారు. కాని ఆమెకు పేరు తెచ్చిపెట్టింది

దర్శకత్వం ఇష్టం

మాత్రం సీరియల్సే.

విలక్షణమైన, సాంప్రదాయక కుటుంబం నుంచి వచ్చిన సాక్షి ముగ్గురు తోబుట్టువులలో చిన్నది. చదువులో ఎప్పుడూ ముందుండే సాక్షి తల్లిదండ్రుల సహకారం ఎల్లప్పుడూ ఉండేదని అంటుంటారు. ఆమె కుటుంబం గురించి ఇంకా ఏమంటున్నారంటే – “తల్లిదండ్రులు నా నిర్ణయాన్ని గౌరవించి నాకు అండగా ఉంటూ వచ్చారు. వారి సహకారంతోనే ఇప్పుడు మీ ముందు మంచి నటిగా ఉండగలిగాను. నా కెరీర్ కోసం కుటుంబం మొత్తం ముంబయికి తరలివచ్చింది. ఎలాంటి సంకటాలు ఎదురయినా తోడుగా, సపోర్టివ్‌గా ఉంటున్నారు. సాంప్రదాయపు కుటుంబమయినా నా కెరీర్‌కు ఇంత సహకారం అందించడం నిజంగా నా అదృష్టం. ఇలాంటి ఎన్నో జ్ఞాపకాలకు కారణమయిన కుటుంబమే నా బలం, బలహీనత అంటూ కుటుంబం గురించి ఎంతో గొప్పగా చెబుతుంటారు సాక్షి తన్వర్.

టివి నటిగా అవకాశం?

“నేను నటించాలని ఎప్పుడూ అనుకోలేదు. ప్రజలకు సేవ చేసే అడ్మినిస్ట్రేటర్‌గా ఉండాలని అనుకునేదాన్ని. సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ కోర్సు చేస్తున్న సమయంలో అనుకోకుండా వచ్చిన అవకాశం. ఢిల్లీ దూరదర్శన్ వారు తీస్తున్న కొత్త సీరియల్‌లో చిన్న అవకాశం ఇస్తామని వచ్చారు. అప్పటికే నేను కాలేజిలో నాటకాలు వేస్తుండేదాన్ని. అలా నాకు మొదటి అవకాశం వచ్చింది. ఇక అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకరి నుంచి ఒకరు నా గురించి తెలుసుకొని అవకాశాలు ఇచ్చారే కాని నాకు ఈ రోల్ కావాలని ఎప్పుడూ అడగలేదు. అసలు ఈ రోజు నేను ఇలా ఉంటానని కలలో కూడా అనుకోలేదు. పని నన్ను వెతుక్కుంటూ వచ్చింది. ఆతర్వాతే నేను పరిగెత్తడం మొదలుపెట్టాను అంటారు సాక్షి.

సామాజిక స్పృహ ఉన్న నటిగా...

వ్యభిచారం కేసులలో పట్టుబడిన వాళ్ళల్లో అమ్మాయిలనే ఎందుకు ఫోకస్ చేస్తారు. వారితో ఉన్న పురుషులను ఎందుకు వదిలేస్తున్నారని శ్వేతబసు విషయంలో మొట్టమొదట నోరు విప్పింది హిందీ సీరియల్ నటి సాక్షి తన్వర్. అంతేకాదు, బాలలు బాహ్య కార్యకలాపాలకు దూరమయ్యి కంప్యూటర్‌కి అంకితమవుతున్నారని అంతర్జాతీయ బాలల చిత్రోత్సవంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సామాజికాంశాలను సంబంధించిన వాటి గురించి కూడా సాక్షి మాట్లాడుతూ ఉంటారు.

గుర్తింపు ఉన్న నటిగా...

నా విజయాన్ని నేను ఎప్పుడూ కొలుచుకోలేదు. కొలవలేను కూడా. కారణం నేను నా పనిని చేసుకుంటూ వెళ్ళాను అంతే”. నేను ఊహించని స్థానంలో నేనున్నాను చాలు ఈ జీవితానికి. నా సీరియల్స్‌లో ఉత్తమమైనది ఎనిమిదేళ్ళపాటు సుదీర్ఘంగా నడిచిన “కహానీ ఘర్ ఘర్ కీ” సీరియల్. నా జీవితానికే అదనపు బహుమానం లాంటిది ఈ సీరియల్. ఇదే సమయంలో స్మృతి ఇరానీ నటించిన క్యూకీ సాస్ బీ కబీ తీ’ సీరియల్ పోటాపోటీగా నడిచాయి. మా ఇద్దరిని ఒకప్పటి స్మితాపాటిల్, షబనా ఆజ్మీల తరంలో వారి మధ్య ఉన్న పోటీతో పోల్చారు. ఇది చాలు నా జీవితానికి. తను ఎంతో మంచి నటి. ఈకాలం పోటీతత్వం మాలో లేదు. అంత పోటీగా మేము ఫీల్ కాలేదు కూడా. అందుకే నాకొచ్చిన ప్రతి సీరియల్, ప్రతి పాత్ర నేను ప్రొఫెషనల్ నటిగా మారటానికి ఎంతో ఉపయోగపడ్డాయి.

అప్పటి తరానికి, ఇప్పటి తరానికి ఉన్న తేడా...?

ఈతరం నాయికలు ప్రవర్తిస్తున్న తీరు అసహ్యంగా ఉంటుంది. నేను ఈ పరిశ్రమలోకి వచ్చిన సమయంలో మా సీనియర్స్ నుంచి ఎంతో నేర్చుకున్నాం. కాని ఈతరం వాళ్ళు మమ్మల్ని చూసినా పలకరింపుగా కూడా నవ్వరు. అంతేకాదు, ఇప్పటికీ నేను వారికి పోటీగా ఫీలవుతున్నారు కూడా.

భవిష్యత్తు...?

దర్శకత్వం చేయాలని ఉంది. ఎప్పుడో ఒకప్పుడు చేస్తాను కూడా. సినిమాలని పూర్తి కెరీర్‌గా మలుచుకోవడం ఇష్టం లేదు. నేను టీవీ రంగాన్ని ఎక్కువగా ఇష్టపడతాను. ఇది నాకు అన్ని ఇచ్చింది. అందుకే నా పునాది, భవిష్యత్తు అంతా టీవీ రంగమే.

పెళ్ళి...?

పెళ్ళిని నేను ఎంతో గౌరవిస్తాను. పుట్టినప్పుడే పెళ్ళి ఎవరితో అన్నది నిశ్చయమవుతుందన్న విషయాన్ని నేను నమ్ముతాను. చూద్దాం ఎవరితో ముడిపడి ఉందో...!

– నక్షత్ర

■ కథ : కూర చిదంబరం

మారిన విలువలు

బస్సు పరుగెడుతోంది. బస్సు కంటే వేగంగా నా ఆలోచనలు పరిగెడుతున్నాయి. కిటికీ పక్క సీటు కావడం మూలాన నా జుట్టంతా రేగి, పాయలు పాయలుగా ఎగురుతోంది. వళ్లో కూచున్న చంటాడు అవేవో వింత వస్తువులనుకుని చేయిచాచి జుట్టు పాయల్ని అందుకో చూస్తున్నాడు. బస్సు సిద్దిపేట చేరింది. “అయిదు నిమిషాలు ఆగుతుంది. దిగేవాళ్లు దిగండి” అంటూ కండక్టరు, డ్రయివరు బస్టాండులోని హోటల్లో దూరారు.

కండక్టర్లు, డ్రైవర్లకు హోటల్ వాళ్లు ఉచితంగా టిఫినూ, టీ ఇస్తారట. నిజమేనా? ఎవర్నడగాలి? అన్నయ్య గుర్తుకు వచ్చాడు. అవును, చిన్నతనంలో నాకు వచ్చే ప్రతి సందేహాన్నీ “అన్నయ్యా ఇదెలా? అన్నయ్యా అదెలా?” అంటూ ప్రశ్నల వర్షం కురిపించేదాన్నట. చిన్నప్పుడు అమ్మా నాన్న కంటే అన్నయ్యను ఎక్కువ అంటిపెట్టుకుని ఉండేదాన్ని స్కూల్లో క్లాసులకెళ్లినప్పుడు తప్ప. కొత్తలో నేను వాడి క్లాసులోనే, వాడి పక్కనే కూర్చుంటానని ఏడ్చానట. పెళ్లయ్యి కాపురానికి వెళ్లేంత వరకూ ఇదే వరుస. చిన్ననాటి ‘నర్సయ్య సారు’ ఉడికించేవారు : ‘స్వరూపా! మేం అందరం ఓనమాలతో అక్షరాభ్యాసం మొదలిడితే నువ్వు ఏకంగా అయిదో తరగతి నుండి మొదలెట్టావు’ అని.

అంతెందుకు, నాపై అమ్మకు కోపం వచ్చినప్పుడల్లా అమ్మ కూడా అంటుండేది “నీకు అమ్మ, నాన్న ఎందుకే? అన్నయ్య వుంటే చాలు” అని. దానికి తోడు వాడు కూడా ప్రాణంలో ప్రాణంగా చూసుకునేవాడు. పల్లెత్తుమాట కూడా ఎవర్నీ అననిచ్చే వాడు కాదు. అన్నయ్యదీ నాదీ అమ్మ పోలికలు. పొట్టి. పరిహాసానికి నన్ను ‘పొట్టి బుడంకాయ’ అని ఎవరు ఉడికించినా వాళ్లతో కలబడేవాడు అన్నయ్య. వాడి సావాసంతోటే నాకు ‘చార్‌పత్తర్, పత్తాలాట, కోతి కొమ్మచ్చి’ ఆడడం వచ్చింది. వామనగుంటలు, బొమ్మల పెళ్లిళ్లు, చాలా రోజుల వరకు నాకు తెలీదు. అన్నయ్య స్నేహితులైన మగవాళ్లే నా స్నేహితులు. వ్యక్తురాలినయ్యేవరకు వాళ్ల సావాసమే! పెళ్లయి అత్తవారింటికి వెళ్లేవరకు అన్నయ్య జంటే!

★★★

‘గుర్రాలగొంది’ అని అరుస్తున్నాడు కండక్లరు. ఆడుకుని ఆడుకుని బాబు నిద్రపోతున్నాడు. కిటికీ అద్దాన్ని కొంచెం మూసేసి, చీర కొంగు తలమీదకు లాక్కున్నాను.

ఏదో జబ్బు చేసింది నాకు. కరీంనగర్ వెళ్లి అక్కడి డాక్టర్లకు చూపించాలన్నారు. అన్నయ్య వెంట వస్తేనే నేను బయల్దేరుతానని నా పంతం.

బస్సెక్కటం అదే మొదటిసారి. కిటికి పక్క సీటు కావాలని వాడితో పేచీపడి సాధించుకున్నాను. కిటికీ పక్క సీటు. కదలకుండా ఉండే చెట్లు పరిగెడతాయని ఆనాడు చూసి పొందిన ఆశ్చర్యం ఇంతా అంతా కాదు.

“సిరిసిల్లా, సిరిసిల్లా” అంటున్నాడు కండక్టరు.

వేములవాడ జాతర తరువాత అంత ప్రముఖమైంది సిర్సిల్లా రథాలపున్నమి. అన్నయ్య వాళ్ల స్నేహితులు ఒక్కో సైకిల్‌ను ఇద్దరు కిరాయికి తీసుకుని సీటు మీద ఒకరు, క్యారియర్ మీద ఒకరు కూర్చుని ఇద్దరూ సైకిల్ తొక్కేవారు. నేనూ వస్తానని మారాం చేస్తే, హాండిల్‌కు సీటుకు మధ్యనుండే ఫ్రేం మీద కూర్చోబెట్టుకున్నాడు అన్నయ్య. ఎంత థ్రిల్లింగ్‌గా ఉండిందో!

తమ్ముడూ తనూ విభాగం అవుతున్నామని బావా నేనూ రావాలని అన్నయ్య ఉత్తరం రాశాడు. ‘నేను వచ్చి చేసేదేం లేదు. ఎవరి వేపు మాట్లాడినా, మరొకవేపు వారికి కోపం. నేను రానన్నాడాయన. చంటాడ్నేసుకుని తనకీ ప్రయాణం తప్పింది కాదు.

బస్సు వేములవాడ చేరింది.

పుట్టి పెరిగిన ఇల్లు. పెళ్లయి కాపురానికి వెళ్లేంతవరకు ఆ ఇల్లు నా శరీరంలో ఓ భాగం అయింది. ఊరికి వెళ్లిన ప్రతిసారీ ఇంటిని చూడగానే ఎన్నో చిన్ననాటి స్మృతులు కదలాడేవి. ఓ పాత పుస్తకాన్ని చదువుతున్నట్టనిపించేది వెళ్లినప్పుడల్లా.

పెళ్లయి వాడికి సంతానం కలిగాక అన్నయ్య ఎంతో మారిపోయాడనిపించింది. ‘ఇదంతా నా భ్రమే! వాడు మారలేదు’ అని ఎన్నోసార్లు సరిపెట్టుకో జూసినా, వాడు మారాడనే అనిపించేది.

ఒక్కోసారి అనిపించేది ‘అవును మారాడు. మారటం సహజం. వాడికీ పెళ్లాం ఉంది. పిల్లలు ఉన్నారు. వాడి కుటుంబం వాడు చూసుకోవాలి కదా!’ అనుకునేదాన్ని. కాని నాకు కలిగే బాధల్లా డబ్బు విషయాలు కాని సందర్భాల్లో కూడా నన్ను పరాయిదాన్ని చేసి మాట్లాడేవాడు. ఇక డబ్బు విషయంలో ‘నేనూ, నువ్వూ, మేమూ, మీరూ’ అన్న పదాలు అతి తరచుగా దొర్లేవి.

ఆటో ఇల్లు చేరింది. ఎంతో అపురూపంగా ఇంటిని కట్టించాడు నాన్న. అన్ని విషయాల్లో నలుగురిలో తను ముందుండాలని తాపత్రయపడేవాడు నాన్న. లంకంత ఇల్లూ, ఇంటి ముందూ వెనుకా పెద్ద పెరడు. పేడ ఎర్రమట్టితో అలికే ఆ రోజుల్లో ఇల్లంతా గచ్చు, సిమెంటు పెంకులు. ఇల్లు కట్టేటప్పుడు ఇంట్లోనే ఓ సున్నండంగూ. దున్నపోతుల్తో నడిపించి కట్టాడట నాన్న. ఉన్నన్ని రోజులూ ‘ఆ ఇంట్లో అంగుళం అంగుళం తన పర్యవేక్షణలోనే జరిగిందని, అది తన ఆరోప్రాణమ’ని గర్వంగా చెప్పుకునేవాడు. ఆనాటి కాలానికి మోడ్రన్‌గా వున్నా, నేటి కాలానికి ఆ ఇల్లు పాతదయిపోయింది. స్థలానికి బోలెడు విలువ వచ్చింది. విభాగం అయి తనవంతు భాగాన్ని అమ్మేయాలని అన్నయ్య ఆలోచన. తమ్ముడు ఇంకా పసివాడే. ఇప్పుడిప్పుడే జీవితంలో స్థిరపడుతున్నాడు. ఏ

విషయమూ పైకి చెప్పడు. అన్నింటా గుంభనమే! తమ్ముడికీ తనకి మధ్య అంతగా అనుబంధం లేదు.

ఇంట్లో మిగతావాళ్ళెక్కడికో వెళ్లారు. వదినా, మరదలు పలకరించారు. ఆ పలకరింపులు ఎందుకో నాకు కృతకం అనిపించాయి. చంటాడి సంగతులు చూసుకుని జట్టు దువ్వుకుని, బొట్టు సరిచేసుకుని పెరట్లోకి నడిచాను. సుమారు అర ఎకరం పెరడు. అంతా వెల్లడిగా ఉంది. ఎన్ని చెట్లు ఉండేవి? మా పెరట్లో లేని చెట్టు ఈ వూళ్లోనే లేదని గర్వంగా చెప్పుకునేవాడు నాన్న.

వేప, దానిమ్మ, ఊళ్లో ఎక్కడా లేని ఇరికి, దబ్బ, నిమ్మ, అరడజను రకాల మల్లెలు, తెల్ల, ఎర్ర గుజ్జు జామ. రెండు బాదాం చెట్లకు చేదతాడు వేసి కట్టిన ఉయ్యాల ఊగరాక బొక్కబోర్లాపడి ముఖం, మోచేతులు గీరుకుపోవడం. వాడందరి అవసరాలు తీర్చే కరేపాకు, అరుదుగా కనిపించే ముద్ద గన్నేరు, సపోటా, మామిడి.

తిననని మారాం చేసినప్పుడు అమ్మ చింతచెట్టును చూపించి దాని మీదుండే దయ్యానికి ఇస్తాననే బెదిరింపులు. మొదటి పెళ్లి చూపుల్లో 'ఏదో దిగులుగా ఉందే అమ్మా' అంటే పొదుముకుని, ఊరిన కన్నీళ్లని కనబడనీయకుండా ముఖం తిప్పుకున్న అమ్మ. వంట చెరుకు కుప్పలోకి జరజరా పాక్కుంటూ మాయమైన పాము. అది గమనించిన అమ్మ తన వీపు చరచటం!

ఆలోచనల దొంతరలు ముప్పిరి గొన్నాయి.

"ఆడపిల్లలకూ ఆస్తిహక్కు' అన్న చట్టం వల్ల నా బుద్ధి ఎటుపోయి ఎటు మారుతుందోనని వాడి భయం. మనసులో ఇవ్వాలని ఉండాలిగాని, చట్టాలేం చేయగలవు?

"ఈ ఇల్లు అమ్మటం అవసరమంటావా అన్నయ్యా" అన్న ప్రశ్నకు "ఆ ఏముందమ్మా ఈ ఇంట్లో అటాచ్డ్ బాత్రూములు లేవు. ఈ పెరడంతా ఊడ్చేసరికి వదిన తల ప్రాణం తోకకి వస్తోంది. కోతుల బెడదతో ఏటేటా పెంకులు మార్చాల్సి వస్తోంది. దూలాలూ, వాసాలు పుచ్చిపోయాయి. ఎప్పుడు కూలుతుందో తెలీదు. పైగా శీతాకాలం వచ్చిందంటే ఇంటి నిండా రాలే వేపాకు, ఆకాశమల్లె ఆకులు. ఓ ఎండుగ ఆపుతోంది" అన్నయ్య జవాబు.

మేనల్లుడు, మేనకోడలు చదువుకోటానికో మరేదో అంతగా ప్రాముఖ్యంలేని అవసరాలు అన్నయ్యవి. నాకు తెలుసు, వీటన్నిటికీ వాడి దగ్గర డబ్బు లేదని కాదు. ఇల్లు అమ్మేస్తే నాతోనూ, తమ్ముడితోనూ ఆస్తి తెగతెంపులు చేసుకోవచ్చు. 'వాలంటరీ డిస్క్లోజర్' స్కీంను ఆర్థికమంత్రి ప్రకటించగానే పన్ను ఎగవేత దారుల ఖాతాల్లోకి బ్లాక్ మనీ జమ అయినట్లు, వేర్పాటు తతంగం అవగానే, బినామీగా ఎక్కడెక్కడ వున్న డబ్బంతా వాడి ఎకౌంటులో చేరుతుంది.

"ఆడపిల్లలకూ ఆస్తిహక్కు' అన్న చట్టం వల్ల నా బుద్ధి ఎటుపోయి ఎటు మారుతుందోనని వాడి భయం. మనసులో ఇవ్వాలని ఉండాలిగాని, చట్టాలేం చేయగలవు? లిటిగేషన్ తప్పు! ఆనాటి ప్రేమ, అనుబంధం, ఎక్కడ పోయిందని ఆశ్చర్యం వేసింది.

మనుషులు ఇట్లా కూడా మారుతారా అనిపించింది. బతకటానికి 'ఎకనమిక్స్' సూత్రాలు పాటించడం అవసరమని వాడిని చూస్తే తెలిసి వస్తోంది.

'నాన్న ఎంతో ఇష్టపడి కట్టుకున్న ఇల్లు ఇది. ఆయన ఆత్మ క్షోభిస్తుందేమో' ఆఖరి అస్త్రం ప్రయోగించాను.

'బతికున్న వాళ్ల అవసరాలు ముందు తీర్చుకోవాలి. ఆత్మలూ, జ్ఞాపకాలు అంతా ట్రాష్. తాతయ్య బతకడానికి ఏదో ఊరు వదిలి ఈ ఊరు వచ్చాడని. నాన్న అంటుండేవాడు. నీలా, తాతయ్య అనుకుంటే ఈ ఊరు వచ్చేవాళ్లం కాదు. ఈ స్థాయికి ఎదిగేవాళ్లం కాదు' అన్నయ్య జవాబు.

తాము మాట్లాడుతున్నది 'బేస్‌లెస్' అని తెలిసీ మభ్య పెట్టే ప్రయ్నతం చేసేవాళ్లకి ఏం చెప్పినా వ్యర్థమే!

మారు మాట్లాడకుండా అన్నయ్య ఇచ్చిన కాగితాలపై చూపిన చోటల్లా సంతకాలు పెట్టి, అన్నా వదినలు ఆ రాత్రి ఉండిపొమ్మన్నా, వినకుండా సాయంత్రం బస్సెక్కాను.

సెల్ : 8885552423

■ స్ఫూర్తినిచ్చిన గురువు

నేను నాలుగో తరగతి నుండి ఏడో తరగతి వరకు నిజామాబాద్ జిల్లా, వర్ని మండలంలోని కోటయ్య క్యాంపు గ్రామంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో చదువుకున్నాను.

నాకు జీవితం పట్ల అవగాహన పెంచి, స్ఫూర్తినిచ్చిన గురువులు ముగ్గురు. భిక్షపతి సార్, రామకృష్ణసార్, మొగులయ్య మాస్టార్లు.

మాకు స్కూలు, హాస్టలు రెండూ ఒకే క్యాంపస్‌లో ఉండేవి. కేవలం మగ పిల్లలకు మాత్రమే హాస్టల్ ఉండేది. భిక్షపతి సార్ నీటికి సంబంధించి పాఠం చెప్పేటప్పుడు అందరికీ బాగా అర్థమయ్యే రీతిలో చెప్పేవారు. ఇంకా జీవితం, బయటి ప్రదేశాలు, జనరల్ నాలెడ్జ్ గురించి చాలా నేర్పించేవారు.

రామకృష్ణసార్ చదువు మధ్యలో విరామం కోసం అంత్యాక్షరి లాంటి పాటల పోటీలు పెట్టి ఉత్సాహపరిచేవారు. చదువుతూ మధ్యలో మాట్లాడకుండా స్నేహితులను విడిగా కూర్చోబెట్టి మరీ చదివించేవారు.

నేనో అనామకుడిగా వుండకుండా ఓ చిన్న రచయితగా, కవిగా, పాటలు రాయగలుగుతున్నానంటే దానికి కారణం మొగలయ్య సార్. నేను ఏడో తరగతిలో ఉన్నప్పుడు ముళ్లపూడి వెంకటరమణగారు రాసిన 'నిజం' అనే పాఠం విన్నాను. ఆ పాఠం చెప్పేటప్పుడు బాపూ, రమణల బొమ్మల గురించి, వారి రచనల గురించి వివరించేవారు. అలా ఆయన చెప్తున్నప్పుడు రచనల మీద ఆసక్తి కలిగేది. నాకూ కథలు రాయాలనిపించింది.

ఆ స్కూలు నుండి బయటికి వచ్చాక ఎన్నో సంవత్సరాలకు మొగలయ్య సార్ ఫోన్ నెంబర్ తీసుకుని మాట్లాడినప్పుడు కూడా గుర్తుపట్టి 'బాగున్నావా, ఏం చదువుతున్నావు? ఎక్కడున్నావు? బాగా చదువుకో' అంటూ, నాగురించే కాకుండా నా స్నేహితుల గురించి కూడా వాకబు చేశారు. అంతే కాకుండా స్కూల్లో ఉన్నప్పుడు నేను వేసిన నాటకాలు, పాడిన పాటల గురించి చెప్తున్నప్పుడు కళ్లమ్మటి నీళ్లు తిరిగాయి. అంత మంచి టీచర్లు నా జీవితంలో ఎదురైనందుకు చాలా గర్వపడుతున్నాను.

- రత్నావత్ పంచారామ్,

ఊట్‌పల్లి, నిజామాబాద్

యుద్ధవార్తల రిపోర్టింగ్‌లో...

నా పాత్రికేయ జీవితంలో అంతకు ముందెన్నడూ గాని, ఆ తరువాత గాని రుచి చూడని అనుభవం బంగ్లాదేశ్ యుద్ధంలో విమాన వాహక నౌక 'ఐ.ఎన్.ఎస్. విక్రాంత్' నుంచి యుద్ధ వార్తలు పంపటం అప్పటి వరకూ గాని, ఇప్పటి వరకు గాని (ఇటీవల 'వార్త' సంపాదకుడు పాకిస్తాన్ సరిహద్దు యుద్ధం కవరేజ్ మినహాయిస్తే) ఆంధ్రప్రదేశ్ నుంచి యుద్ధ వార్తల విలేఖరిని నేనొక్కడినే కావటం నాకు కించిత్ గర్వ కారణం; కాస్త కాలరెత్తుకొని తిరిగితే కాదనరనుకొంటా. ఇలాంటి వార్త సేకరణకు అనుభవజ్ఞులైన వారిని గాని, ఢిల్లీ కార్యాలయం నుంచి గాని పంపటం రివాజు, బహుశా హైదరాబాద్, విశాఖలనుంచి నేను పంపిస్తూ వచ్చిన ప్రత్యేక వార్తలు యాజమాన్యానికి నాలో విశ్వాసం కలిగించాయనుకొంటా. నాకే బాధ్యతనప్పగించింది యుఎన్ఐ యాజమాన్యం. 'అయ్యో, యుద్ధ భూమిలోకి వెళ్తున్నా, చచ్చిపోయే ప్రమాదముందనే' ఆలోచనే నాకు



విలేఖరులందరికీ తెలిసిపోయిన వార్తే కాబట్టి నేను వార్తను టైపు చేసి, టెలిప్రింటర్‌లో పంపించమని, వైస్-అడ్మిరల్ కొత్త విషయాల నేమైనా చెబితే, ఫోన్‌లో చెబుతానని ఆపరేటరుకు చెప్పి వెళ్లా.

రాకపోగా ఇదొక ఉత్తేజాన్ని కలిగించే అవకాశంగా భావించా. విశాఖలో మా బంధువుల ఇంటికి వెళ్లినపుడు ఆ వార్త చెబితే, వాళ్ల భయంతో కూడిన స్పందన విన్న తర్వాతనే, "ఆహా, ఈ ఆలోచన నాకు రాలేదే" అన్న ట్యూబులైట్ వెలిగింది. అయినా నాకేమి నీరసం రాలేదు. విక్రాంత్ లాంటి యుద్ధనౌకలో ప్రయాణం చేయటం అంటే మాటలా? అదెంతమందికి సాధ్యం? అలాంటి అదృష్టం నాకు కలిగిందనే సంతోషానిదే పైచేయి అయింది. మరొకందుకు కూడా. ఆ యుద్ధ నౌకలో ఇద్దరే ఇద్దరు విలేఖరులు ప్రయాణించారు. ఆ ఇద్దరిలో నేనొకణ్ణి. మరో విలేఖరి పిటిఐ వార్తా సంస్థ నుంచి వచ్చాడు.

ఆ నౌకలో ప్రయాణం విశేషాలు చెప్పేముందు మరొక పరిణామం గురించి చెప్పాలి. అదే పాకిస్తాన్ సబ్‌మెరైన్ "ఘాజీ" విశాఖ తీరంలో డిసెంబర్ 03, 1971న మునిగిపోవటం. అది తెల్లవారుఝామున జరిగింది. అంతకు ముందురోజు సాయంత్రం టెలిప్రింటర్‌లో ఢిల్లీ మీదగా పాకిస్తాన్ విమానాలు ఎగిరాయని ఫ్లాష్ వార్త-వచ్చింది. విశాఖలో నేవల్‌బేస్ వుంది. నేను మరునిముషంలోనే ఆ బేస్ అధిపతి వైస్ అడ్మిరల్ కృష్ణకు ఫోన్‌చేసి ఈ వార్త చెప్పేసరికి ఫోన్ దబ్బున డ్రాప్ చేసిన శబ్దం వినిపించింది. ఆ తర్వాత కలెక్టర్‌కు, పోర్టు యాజమాన్యానికి, పోలీసు అధికారులకు ఫోన్‌చేసి చెప్పా. మొత్తం పట్టణం అంతా అప్రమత్తం అయింది. తెల్లవారుఝామున పాకిస్తాన్ జలాంతర్గామిని పేల్చి వేసిన శబ్దం- ఆ సమయంలో నేను కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ వినాయక్ గదిలో కూర్చొనివున్నా. ఆయన రాత్రి తెల్లవార్లూ ఎపుడేమి జరుగుతుందోనని డ్యూటీలో వున్నారు. సుమారుగా కలెక్టరు కార్యాలయానికి ఎదురుగా వున్న సముద్ర భాగంలో ఈ ఘటన జరిగింది. ఈ వార్త ఊరంతా గుప్పుమంది. తెల్లవారి పాత్రికేయులందరికీ నేవల్‌బేస్ కార్యాలయం నుంచి పిలుపు. విలేఖరులందరికీ తెలిసిపోయిన వార్తే కాబట్టి నేను వార్తను టైపు చేసి, టెలిప్రింటర్‌లో పంపించమని, వైస్-అడ్మిరల్ కొత్త విషయాల నేమైనా చెబితే, ఫోన్‌లో చెబుతానని ఆపరేటరుకు చెప్పి వెళ్లా. మామూలు పత్రికా విలేఖరుల సమావేశంలోలాగే ఈ సంఘటన వివరాలన్నీ చెప్పి, ఆ తర్వాత మేమున్న గది తలుపులు బయట నుంచి గెడ వేసేశారు. అదేమిటని అనుకుంటుండగానే, వైస్-అడ్మిరల్ తిరిగి వచ్చి ఆ రోజున పార్లమెంటు సమావేశం జరుగుతుంది కాబట్టి, ఆ సమావేశంలో ప్రభుత్వం ప్రకటించక ముందు పత్రికలకు ఆ వార్త ఇస్తే, చిక్కులెదురవుతాయని, అందుచేత ఈ 'నిర్బంధం' అమలు చేయాల్సి వచ్చిందని తెలియచేసారు. చాయ్‌లు తాగుతూ, ఊహాగానాలు చేసుకొంటూ కాలం గడిపాం. తలుపు తీయటంతోనే మా కార్యాలయానికి ఫోన్‌చేసి ఆపరేటర్‌కు లైన్ క్లియర్ ఇచ్చేశా. మిగతా విలేఖరులు (ఒక్కరు మినహా) నేవల్‌బేస్ నుంచి వారివారి కార్యాలయాలకు వెళ్లి, టైప్ చేసి, ఫోన్లు చేసేలోపల మా ఏజన్సీ వార్త దేశమంతటా చేరిపోయింది, ఆ రోజున మా సంస్థ స్కోర్ చేసింది. అది లగాయితు, నేను యుద్ధనౌకలోకి వెళ్లేరోజు వరకూ మా సంస్థ యుద్ధ వార్తలు స్కోర్ చేయని రోజులేదు. దీనికి ఓ చిన్న ఏర్పాటు చేసుకొన్నా. యుద్ధ వార్తను మొదటిసారిగా నేవల్‌బేస్‌కు అందచేయటంతో ఆ బేస్‌లో పి.ఆర్.వోతో పరిచయం ఏర్పడింది. ఆ రోజు నుంచి మా టెలిప్రింటర్‌లో వచ్చిన యుద్ధ వార్తలన్నీ నేవల్‌బేస్‌కు ఫోన్ చేసి చెబుతూండటం, పిఆర్వో బేస్ నుంచి ప్రతీరోజూ స్థానిక పత్రికా విలేఖరులకు మెసెంజర్ ద్వారా పంపే ప్రకటనలను. ఫోన్ మీద ముందే నాకు వినిపించడం (నాకు షార్ట్‌హాండ్‌వచ్చు)- ఇదీ చేసుకున్న ఏర్పాటు ఇందువల్ల ఇతర పత్రికా విలేకరుల కార్యాలయాలకు మెసెంజర్ ద్వారా పత్రికా ప్రకటన చేరేసరికి, ఆ వార్త దేశం అంతటా యుఎస్ఐ వార్తా సంస్థ ద్వారా పత్రికలకు చేరుతుండేది. దేశ మంతటా మా సంస్థ జెండా ఎగిరింది. ఆ ప్రత్యేకత నేను యుద్ధ నౌకలో ప్రవేశించిన తర్వాత కూడా కొనసాగింది. అదేమిటో ఇపుడు చెప్తా. 1971 డిసెంబర్ 3న కాబోలు యుద్ధం ప్రారంభమైంది. మేము (నేను, పిటిఐ విలేఖరి) 14వ తేదీన మాత్రమే నౌకలో ప్రవేశించాం. 17వ తేదీకి యుద్ధం ముగిసింది. నౌకలో ప్రవేశించిన వెంటనే మా ఇద్దరికీ ఒక గది ఇచ్చారు. సౌకర్యం బాగానే వుంది. కాని అది ఆ నౌకలో క్వారంటైన్ గది, అంటే అంటువ్యాధిలాంటిదేమైనా వస్తే ఈ రోగులకు ఇచ్చే గది అని ఎవరో చెప్పే సరికి, మాకు అహం పొడుచుకు వచ్చింది. కాని ఈ విషయం చెప్పిన వారే మమ్ములను సముదాయించారు. నౌకలో ప్రత్యేక గది వుండేది ఒక కెప్టెన్‌కే. మిగతా

అధికారులంతా ఒకో గదిలో ఇద్దరు ముగ్గురుంటారని, వీరందరికీ కామన్ టాయిలెట్లు, బాత్‌రూమ్‌లుంటాయని, కెప్టెన్‌కిచ్చిన సౌకర్యం ఈ నౌక మొత్తంలో మీకే దక్కిందని, ఆ గదిని క్వారంటైన్ గదిగా ఉపయోగించాల్సిన అవసరం ఆ నౌకలో ఎపుడూ రాలేదని చెప్పిన తర్వాత మా అహం శాంతించింది. ఆ నౌక ఒక చిన్న గ్రామం అంత వుంటుంది. బ్రిటన్ వాళ్ల కొన్నాళ్లు వాడిన తర్వాత, సెకండ్‌హాండ్‌ది భారత్ కొనుగోలు చేసింది. 1961లో కొన్న ఈ విమాన వాహన నౌక బంగ్లాదేశ్ యుద్ధానికి ముందు ఎపుడూ ఒక్క యుద్ధంలోనూ పాల్గొనలేదు. కాగా యుద్ధంలో పాల్గొనటం ఆ నౌకలో నివసించే 1,500 మందికి, మాకూ కొత్తే. నిజంగా ఈ నౌక యుద్ధంలో పాల్గొనదు; యుద్ధం జరిగే ప్రాంతానికి దూరంగా వుండి, విమానాలకు ఎయిర్ పోర్టులా వినియోగపడుతుంది. శత్రు జలాంతర్గాములేవైనా గాని పరిసరాల్లో వుంటే, ఆ విషయాన్ని పసిగట్టి కెప్టెన్‌కు అందచేసే పరికరం ఆ నౌకలో వుందని చెప్పినట్లు గుర్తు. ఈ నౌకలో ఏడు అంతస్థులున్నాయి. ఏడో అంతస్థు అంటే అన్నిటి కన్నా పైన వుండే అంతస్థు నుంచి (దీనినే డెక్ అంటారు) విమానాలు ఎగిరి, తిరిగి వస్తాయి. ఆ అంతస్థు అత్యంత విశాలంగా వుండి విమానాశ్రయంగా ఉపయోగపడుతుంది. విమానాశ్రయాల్లోలా అంత పొడవు రన్‌వేకు అవకాశం లేదు. కింద ఆరో అంతస్థులో ఓ అరడజను కాబోలు విమానాలకు హాంగర్‌గా వినియోగపడుతుంది. దాని నుంచి ఏడవ అంతస్థు మీదకు రావడానికి పెద్ద ఓపెనింగ్ ఏర్పాటు చేశారు. పైకి వచ్చిన తర్వాత మనం చిన్నప్పుడు బడిలో రాయిని చెట్లనున్న పళ్లను రాల్చడానికి వినియోగించే ఉండేల్ లాంటిదాన్ని ఏర్పాటు చేశారు. అలా చేయడం వల్ల ఒక్క విసురుతో, నౌకనుంచి గాలిలోకి లేస్తుంది. కొత్తవాళ్లు ఆ నౌకలో ప్రవేశిస్తే, అది అభిమన్యుడి పద్మవ్యూహమే. ఆ నౌకలో నావికులు, వారి అధికారులు తప్ప, సివిలియన్స్‌కు అవకాశం లేదు. కాని మేమిద్దరం సివిలియన్స్ కాబట్టి తాత్కాలికంగా లెఫ్టినెంట్‌గా మాకు గుర్తింపు నిచ్చారు. ఇది అధికారుల భోజనశాల, క్లబ్‌ల్లోకి వెళ్ళే వీలు కలిగించింది. ఆ నౌకలో 'మద్యం' కారు చౌక. ఒక పెగ్ స్కాచ్ విస్కీ ఒక రూపాయే. నేను 'మందు' దాసుణ్ణి కాదు కాని అపుడపుడు రుచి చూచిన వాణ్ణే అయినా, అంతకు ముందు అల్సర్‌తో బాధపడి ఆపరేషన్ చేయించు కొన్నవాడిని కావటంతో, చాలా కష్టంగానే దానికి దూరంగా వుండిపోయా. కాని నా మిత్రుడు మందు ప్రియుడు. అందులో అంత చౌక కావటంతో మందుకు పూర్తి న్యాయం చేసాడనే చెప్పాలి. నౌకలో వున్న 1,500 మందికి భోజనం పెట్టాలంటే మాటాలా? ఏదైనా అంతా టన్నుల్లోనే వంటకాలు. ఎన్నో రోజులు సముద్రంలో ప్రయాణం చేయాల్సి వస్తుంది. కాబట్టి ఇంకా అన్ని టన్నుల కూరలు, బియ్యం, మాంసం కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేస్తారు. ఆ నౌక ఆకర్షణీయమైన భాషలో రాసి ఒక బకాసురుడు బంగాళాఖాతంలో తిరుగుతున్నాడని, వాడి పొట్టకు హద్దుల్లేవని, టన్నులు టన్నులు మింగుతుంటాడని, తనకు తిండి పెట్టే యజమానులకు మాత్రం నమ్మిన బంటులా పని చేస్తున్నాడని పంపిన వార్తకు ఎంతగానో ప్రాచుర్యం లభించింది.

తెలుగు నావికుడితో దోస్తి

నౌకలో అలా అలా తిరుగాడుతుంటే, యాదృచ్ఛికంగా ఒక తెలుగు నావికుణ్ణి కలుసుకొన్నా, వాడికీ నాకు ప్రాణం లేచివచ్చినట్లయింది. తెలుగు వాళ్లను ఒక డజనుమందిని పోగు చేశాడు. వాళ్లతో బాతాఖానీలో ఎన్నెన్నో అత్యంత ఆకర్షణీయమైన విషయాలు తెలిసాయి. మామూలుగా అయితే ప్రతీరోజూ విలేఖరులిద్దరనీ ఒక్కసారి మాత్రం కెప్టెన్‌ను కలుసుకొనే ఏర్పాటు చేశారు. ఒక అధికారిగా పరిమిత సమాచారం లభించేది. కాని ఈ నావికులతో మాట్లాడటంతో నాకు అత్యంత వార్తాభరితమైన సమాచారం లభించింది. మొదటిరోజున నాలుగు విమానాలు ఢాకా మీద దాడి చేయడానికి ఎగిరి వెళ్లాయి. వారికి ఎక్కడా ఎదురు దాడి చేసిన దాఖలాలే లేవు. కిందనుంచి తుపాకులు పేల్చినంత శబ్దం మాత్రం వచ్చింది. ఎదురు లేకపోవటంతో ఈ నాలుగు విమానాలు క్షేమంగా తిరిగి వచ్చాయి. యుద్ధంలో పాల్గొనటం అదే మొదటిసారి కావటంతో, నౌకలోవున్న వారంతా ఆతృతగా ఎదురు చూచారు. వాళ్లంతా క్షేమంగా తిరిగి వచ్చారేమో, నావికుల ఆనందానికి హద్దుల్లేవు.. చప్పట్లు, కౌగిలింతలతో ఆహ్వానించారు. అయినా వారికి తృప్తి కలగలేదు. అటువంటి సందర్భాల్లో మెడలో దండలు వేసి సన్మానించటం సంప్రదాయం. కాని నౌకలో పువ్వులు దొరకవు కదా. చటుక్కున ఒక ఐడియా వారికి తట్టింది. ఒక్కొక్కరి వద్ద నుంచి ఒక్కొక్క రూపాయినోటు వసూలు చేసి, నోట్లను దండలుగా చేసి వారి మెడల్లో వేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేసుకొన్నారు. ఇది జరిగింది నాలుగో తారీఖున. ఆ తర్వాత ఊరకనే సాయంత్రం పూట షికారుకు వెళ్లి రావటం జరిగింది. ఇలాంటి కథలెన్నో చెప్పారు. ఇది కూడా వార్తగా మలిచి పంపగా దేశంలోని పత్రికలన్నింటిలో అచ్చయింది. అయితే ఇలా వార్తలు

> ***మొదటిరోజున నాలుగు విమానాలు ఢాకా మీద దాడి చేయడానికి ఎగిరి వెళ్లాయి. వారికి ఎక్కడా ఎదురు దాడి చేసిన దాఖలాలే లేవు. కిందనుంచి తుపాకులు పేల్చినంత శబ్దం మాత్రం వచ్చింది. ఎదురు లేకపోవడంతో ఈ నాలుగు విమానాలు క్షేమంగా తిరిగి వచ్చాయి.***

పంపటంలో కొన్ని పరిమితులున్నాయి. ఏ దేశంలో, ఏ యుద్ధంలోలాగే, మేము పంపాల్సిన వార్తలను కెప్టెన్‌కు ఇవ్వాలి. ఆయన సెన్సారు చేసి ఢిల్లీ పంపాలి. ఈ వార్తలను, ఆ మాట కొస్తే ఏ విషయమైనా ఢిల్లీ పంపాలంటే శత్రువు Interception కు గురికాని దిక్కున నౌక ప్రయాణం చేస్తున్నప్పుడే పంపాలి. ఢిల్లీ యుద్ధ కార్యాలయంలో మరోసారి సెన్సార్ చేసి, ఆయా వార్తా ఏజెన్సీల కార్యాలయాలకు పంపేవారు. మా ఇరువురికి రాజభోగం లభించింది. కాని మరో పాత్రికేయుల బృందం నేరుగా శత్రుస్థావరాల మీద శతఘ్నులు పేల్చే నౌకల్లో ప్రయాణించారు. నిజమైన రిపోర్టులు వాళ్లు పంపారు. ఆ నౌకలు చాలా చిన్నవి కావటంతో చాలా ఇబ్బందులు పడాల్సింది. వారు తమ ప్రాణాలొడ్డి, తమ బాధ్యతను నిర్వహించారు. అయితే అదృష్టవశాత్తు తూర్పు పాకిస్తాన్ చాలా బలహీనమైనది కాబట్టి, భారతీయ దాడులకు దీటైన ప్రతిదాడులు జరక్కపోవటం మన నావికులు ఎటువంటి ఎదురుదాడులు ఎదుర్కోవాల్సిన అవసరమే లేకపోయింది. 17వ తేదీన అంటే యుద్ధం ప్రారంభించిన 14 రోజుల్లోనే ముగిసిందని చెప్పారు కదా. విశాఖ నేవల్‌బేస్ అధికారి వైస్ అడ్మిరల్ విమానంలో వచ్చి నౌకడెక్ మీద హర్షధ్వానాల మధ్య యుద్ధంలో గెలిచిన విషయాన్ని ప్రకటించారు. మా ఇద్దరినీ తూర్పు పాకిస్తాన్ (బంగ్లాదేశ్) తీసుకొని వెళ్తారా అని ప్రశ్నిస్తే తీసుకొని వెళ్తాకాని, వెనక్కు తీసుకొని రావటం గురించి మాత్రం హామీ ఇవ్వలేనని అన్నారు. ఆ తర్వాత నన్ను బంగ్లాదేశ్ వెళ్లి యు.ఎస్.ఐ. కార్యాలయం తెరవమని యాజమాన్యం కోరగా అంత సాహసం చేయలేకపోయా.

- వి. హనుమంతరావు, 9392050878

నెమలీక

రాజు – చీమ

మహేంద్రపుర రాజ్యానికి వీరసింహుడు అనే రాజు పాలించేవాడు. ఆ రాజు ప్రజలను కన్న బిడ్డల్లా చూసుకుంటూ రాజ్యాన్ని ఏలుతుండేవాడు. కానీ వీరసింహుడికి మంత్రి, సైనికాధికారి, మిగిలిన అధికారులు పాలనలో సహకరించేవారు కాదు. దాంతో వీరసింహుడు అనుకున్నంతగా ప్రజల్ని సంతోషంగా ఉంచలేకపోయేవాడు. ప్రజారంజకంగా పాలించలేకపోతున్నాననే బాధ, నిరాశతో ఎక్కడికైనా దూరంగా వెళ్లిపోవాలనుకున్నాడు. ఎక్కడికి వెళ్లాలని ఆలోచిస్తూ, ఎక్కడికి వెళ్లినా ప్రజలు గుర్తుపడతారని, చివరికి ఏమీతోచక చనిపోవాలనే నిర్ణయానికి వచ్చాడు. ఆ ఆలోచన రాగానే వీరసింహుడు రాజభవనం పైకి చేరుకుని పిట్టగోడ మీద చేతులు ఆనించి, కిందికి చూశాడు. వీరసింహుడు చేతులు పెట్టన దగ్గరే ఒక చీమ కనిపించింది. అది తన నోటితో పంచదార పలుకు పట్టుకుని వెళ్తోంది. అది పంచదార పలుకును మోయలేక మోయలేక అవస్థలు పడుతూ అలా కొంత దూరం పోయి గోడ పగుళ్లలో ఉన్న తన నివాసంలోకి దూరింది.

ఈ చీమ ఎక్కడో కిందున్న వంటగదిలోని పంచదారను నాలుగంతస్థులు మోస్తూ పైకి వచ్చింది. ఇంత చిన్న చీమ తనకు మించి కష్టపడుతుంటే, దానికంటే ఎన్నో రెట్లున్న నేను నా రాజ్య ప్రజల సుఖ సంతోషాల కోసం ఇంకాస్త కష్టపడలేనా అనుకున్నాడు.

చనిపోవాలనే ఆలోచనను విరమించుకుని, కొత్త ఉత్సాహాన్ని నింపుకున్నాడు. అప్పటి నుండి మంత్రులను, అధికారులను మంచి మాటలతో తనవైపు తిప్పుకుని, పాలనలో తనకు సహకరించేలా చేసుకుని ప్రజలు అన్నివిధాలా సంతోషంగా ఉండేలా పాలించసాగాడు.

రంగులతో అందంగా

చుక్కల్లో దాగున్నదెవరో!



జంట పిల్లులు

ఈ ఎనిమిది పిల్లుల్లో ఏవేవి జంట పిల్లులో చెప్పండి.



ఆ అంకెలేవి?

కింది సగ భాగంలో ఉన్న అంకెల ఆధారంగా ఎక్కాల సాయంతో పైన సగ భాగంలోని కొచ్చెన్ మార్కు దగ్గర ఏ అంకెలు ఉండాలో చెప్పండి.

పక్షి – గూడు

పక్షులు చాలా తెలివైనవి. ఒక్కో పక్షి ఒక్కో రకమైన అల్లికతో మనకు అర్థం కాకుండా గూడు కట్టుకుంటుంది. మరి ఇక్కడున్న ఐదు పక్షులు, గూళ్లలో ఏ గూడు ఏ పక్షిదో గుర్తు పట్టగలరేమో ప్రయత్నించండి.

మూడుతో నాలుగు

అగ్గిపుల్లలతో చేసిన ఈ మూడు త్రిభుజాల్ని కొద్దిగా అటూఇటూ మార్చి నాలుగు త్రిభుజాలు కనిపించేలా చేయగలరేమో ప్రయత్నించండి.



చెయ్యి

పై చెయ్యి – ఆధిక్యం
చేజిక్కిన – లభించిన
చేజారిన – కోల్పోయిన
చెయ్యి చేసుకొను – కొట్టు
చెయ్యి తిరిగిన – నైపుణ్యం
చెయ్యి తడపడం – లంచం ఇవ్వడం
చేతిలో చేయి వేసి – ప్రమాణం చేయడం
చెయ్యి కలపడం – స్నేహం చేయడం
చేతి వాటం – దొంగతనం
చేతికి ఎముక లేకపోవడం – ఎక్కువ దానాలు చేయడం
చేతి చమురు వదలడం – డబ్బు వృధాగా ఖర్చయిపోవడం
చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడం – ప్రమాదం జరిగిన తర్వాత జాగ్రత్త పడడం

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

(గతవారం తరువాయి)

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి, ఫోన్: 91776 18708

అప్పటికే అడుగు తీసి అడుగు వెయ్యలేనంతగా కిక్కిరిసిన లండన్ మురికివాడల్లోకి ఇర్లండ్‌లోని క్షామంతో మరి కొన్ని వేలమంది వచ్చి చేరారు. అయితే కొత్తగా వచ్చినవాళ్లకు మనుషుల ఆనవాళ్లు లేవు. లండన్ సందుల్లో ఎక్కడ పడితే అక్కడ కూర్చున్న వృద్ధ మహిళలు చెత్త బస్తాల్లా కనిపించారు. వాళ్ళు పీలుస్తున్న పైపుల్లో నుంచి వచ్చిన పొగ వల్ల మాత్రమే అక్కడెవరో మనుషులున్నారని పోల్చుకోగలం. చింకిపాతల్లో వున్న పిల్లలు ఒళ్లంతా కప్పుకొన్న మురికితో ఆడో, మగో కూడా తెలియలేదు. ఇక వయసెంతో చెప్పటం అసంభవవం. మరికొందరు ఒంటి రంగు పూర్తిగా మారిపోయింది. అప్పటికే అక్కడ వుంటున్న ఐరిష్ వాళ్లు కొత్త వాళ్లను రానివ్వలేదు. అసలే కూలీ డబ్బులు సరిపోవటం లేదంటే వీళ్లు మరింత తక్కువకు పని చేస్తామంటున్నారు. పైగా కాలు మోపటానికి స్థలం లేని చోట వీళ్లెలా వుంటారు?

మాంచెస్టర్‌లో మురికివాడలు నది పొడవునా వెలిశాయి. కాని లండన్‌లో స్థలాభావంతో నిట్టనిలువుగా లేచాయి. ఈ నాలుగంతస్తుల కట్టడాల్లో, సెల్లార్ నుండి డాబా మీది గది దాకా ఆక్రమించారు జనం. ఒక్క అంగుళం కూడా వదల్లేదు. చివరికి మెట్లు కూడా. కొందరు మొత్తం బెడ్ అద్దెకు తీసుకోవటానికి డబ్బు లేక, తాము పడుకోగలిగినంత స్థలం మాత్రమే కావాలన్నారు. మరి కొందరు గోడకు వేలాడదీసిన తాడును అద్దెకు తీసుకున్నారు. అవి పట్టుకొని, కూర్చుని నిద్ర పోవచ్చు. సంపన్నులకు నిత్యానుభవమైన వెచ్చటి పడకకోసం వెదుకుతూ ఆడా, మగా, పిల్లా, పెద్దా నగరమంతా తిరిగారు. శరణార్థుల సంఖ్య పెరిగి, 'కూలీ ఎంత?' అని కాక, కూలీ దొరికితే చాలనుకొనే దశకు దిగజారటంతో లండన్ పరిస్థితి, మాంచెస్టర్ కన్నా అధ్వాన్నంగా తయారైంది. అక్కడి సోహో స్క్వేర్, సెయింట్ గైల్స్, స్ట్రాండ్‌లలోని సెక్స్ వ్యాపారం ఎంత నికృష్టంగా వుందో ఊహించుకోవాల్సిందే. ఎవరైనా డబ్బులు విదిలించకపోతారా అనే ఆశతో పాలబుగ్గల పసి పిల్లలు పచ్చిబూతులు మాట్లాడుతూ కస్టమర్లను ఆకర్షించటానికి ప్రయత్నించారు. గ్రామాల నుండి నిర్వాసితులై వచ్చిన పిల్లలు వీధుల్లో బతకగలిగే కళను త్వరగా అభ్యసించారు. పొట్ట చేత పట్టుకున్న కార్మికులు, ఆకలికి తాళలేని వాళ్లు ఏ పని చెయ్యటానికైనా వెనుకాడరు. 'జీవించే విద్య' అంటే అదే. 'అమ్మటానికి నీ దగ్గిరేముంది?' అని సమాజం అడిగింది. మాంచెస్టర్‌లోని కార్మికుల్లాగానే వీళ్లూ తమ శరీరాలను అమ్మకానికి పెట్టారు.

ఇద్దరు మిత్రులూ (మార్క్స్, ఎంగెల్స్) నగరమంతా తిరిగి పేదలకు వీలైనంత సాయం చేస్తున్న జర్మన్‌లనూ, ఇంగ్లీష్ వాళ్లనూ కలిశారు. ఇందులో కొందరు 'లీగ్ ఆఫ్ ది జస్ట్' సభ్యులు (మార్క్స్‌కు వీళ్లతో పరిచయముంది). ఇక్కడ జర్మన్ వర్కర్స్ ఎడ్యుకేషనల్ అసోసియేషన్ పేరుతో పని చేస్తున్నారు. కార్ల్ షాపర్, హైన్రిష్ బార్, జోసెఫ్ మాల్ వీళ్ల నాయకులు. "నాకు తెలిసిన తొలి విప్లవ కార్మికులు వీళ్లే. నా మీద చెరగని ముద్ర వేశారు" అన్నాడు ఎంగెల్స్.

నిజానికి లీగ్, విద్యా సంస్థను ప్రారంభించింది, సభ్యులను చేర్చుకోవటానికే. దీనికి స్విట్జర్లాండ్, జర్మనీలలో శాఖలున్నాయి. ప్రభుత్వాలకు విద్యా సంస్థల మీద అనుమానం వచ్చినప్పుడు స్పోర్ట్స్ క్లబ్బుల్లాంటివి ప్రారంభించి తమ కార్యకలాపాలు కొనసాగించారు. ఎలాగైనా, కొత్త వాళ్లను ఆకర్షించి రహస్య సంస్థ అయిన 'లీగ్'లో చేర్చుకోవటం ముఖ్యం. ఇప్పుడిందులో, జర్మన్‌లే కాక ఇతర దేశాల వాళ్ల సంఖ్య కూడా పెరగటంతో 'కమ్యూనిస్ట్ వర్కర్స్ ఎడ్యుకేషనల్ అసోసియేషన్'గా పేరు మార్చారు. ఇరవై భాషల్లో ముద్రింపబడిన సభ్యత్వం కార్డుల మీద మానవులంతా సోదరులే – ఆల్ మెన్ ఆర్ బ్రదర్స్ అని రాశారు. అయితే, ఎంగెల్స్ మాటల్లో "ఇందులో ఎక్కువగా వృత్తి నిపుణులే సభ్యులుగా వున్నారు. వృత్తి నిపుణులంటే కార్మికులలోని సంపన్న వర్గం. ఎక్కువ మందికి యజమానులు కావాలని కోరిక వుంది."

ఇంగ్లీష్ రాడికల్ ఉద్యమంలో మొదటి నుండీ కార్మికులూ, వృత్తి నిపుణులూ కలిసే వున్నారు. 1792లోనే థామస్ హార్డీ అనబడే బూట్ల తయారీదారు ఓటింగ్ హక్కుల కోసం లండన్ కరస్పాండింగ్ సొసైటీ స్థాపించాడు. ఈ చర్యను దేశ ద్రోహంగా పరిగణించి, సజీవంగా పొట్ట కోసి, తర్వాత ఆయన్ను ఉరితీశారు. అధికారులు, ఇతర దేశాల కన్నా ముందరే ఇంగ్లండు పారిశ్రామికీకరణ చెందింది గనక (కొత్త పారిశ్రామిక) వ్యవస్థ అధ్యయనానికి ఇదే అనువైన చోటు. 1820లో తొలి బ్రిటిష్ సోషలిస్ట్ అయిన రాబర్ట్ ఓవెన్ 'కార్మికుల వద్ద శ్రమ అనబడే డబ్బుంది కాని ఆ డబ్బులకు విలువ లేదు' అన్నాడు. ఫ్యాక్టరీ యజమానులు, ఉత్పత్తిదారులే ఈ దోపిడీ వ్యవస్థకు కారణమన్నారు రాడికల్స్. వీళ్లందరూ ముందున్న ధనిక భూస్వాములు, బడా వ్యాపారస్తులు కూడా కార్మికుల దుస్థితికి కారణమే. నిజానికి ఇప్పుడు ఆవిర్భవిస్తున్న పరిశ్రమలకు ఆర్థిక సహాయం చేస్తున్నది వీళ్లే.

1830లో మాంచెస్టర్‌లోని కార్మికులు, పురుషులందరికీ ఓటు హక్కు కావాలనే డిమాండ్‌తో ఒక యూనియన్ పెట్టుకోవటానికి ప్రయత్నించారు. కాని ప్రభుత్వం నిరాకరించింది. కార్మికులు తమను తాము ఒక వర్గంగా గుర్తించుకున్నారు. వాళ్ల "కార్మిక వర్గం" అంటే వర్కింగ్ క్లాస్. అల్ప సంఖ్యాకులు చేసిన చట్టాల వల్లనే ఇన్ని సమస్యలొస్తున్నాయి. అధిక సంఖ్యాకులు చట్టాలు చేయటమే దీనికి పరిష్కారం" అన్నారు.

1837లో బ్రిటిష్ కార్మికోద్యమ నాయకులు పార్లమెంట్ – హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఆరు డిమాండ్లతో ఒక అర్జీ పెట్టుకున్నారు. ఇదే పీపుల్స్ చార్టర్. రాజకీయ సంస్కరణలు, బ్రిటిష్ పౌరులందరికీ పార్లమెంట్‌కు పోటీ చెయ్యగలిగే హక్కు కల్పించటం వీళ్ల ముఖ్య డిమాండ్లు. కాని వీళ్లనెవరూ పట్టించుకోలేదు. 1845లో చార్టిస్టులు, ఫ్రాన్సు, జర్మనీలలో వున్న కార్మికులను కూడా కూడగట్టుకోవటానికి ప్రయత్నించారు (ఉద్యమం కొనసాగాలంటే విస్తృతమైన సహకారం తప్పదు).

ఈ నేపథ్యంలో 'ఇద్దరు మిత్రులు' ఇంగ్లీష్ కార్మిక నాయకులతో చర్చలు జరిపారు. చార్టిజం, సోషలిజం, కమ్యూనిజం వగైరా అన్నీ బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా కార్మికవర్గం చేస్తున్న చారిత్రక పోరాటాలకు మారు పేర్లే అన్న విషయం స్పష్టమైంది.

కార్మిక నాయకుల అనుభవాల నుండి చాలా నేర్చుకున్న మార్క్స్, ఎంగెల్స్ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయటానికి మార్గాలను అన్వేషిస్తూ బ్రసెల్స్ చేరుకున్నారు.

పైకి ఎంత కఠినంగా కనిపించినా సాటి మనుషుల పట్ల మార్క్స్‌కున్న సహానుభూతి గొప్పది. అతణ్ణి విమర్శించే వాళ్లు తరచూ ఈ విషయం విస్మరిస్తారు. 'మార్క్స్‌లో ప్రేమకన్నా ద్వేషం ఎక్కువ' అన్నారు కొందరు సమకాలికులు. కాని ఆయన జీవితాన్ని నిశితంగా పరిశీలిస్తే రెండూ సమ పాళ్లల్లో ఉన్నాయని

అర్థమవుతుంది. ఇంగ్లండులో చూసిన మనుషుల్ని పరిస్థితుల్ని బట్టే ఈ రెండు భావనలూ అతనిలో కలిగాయి. ఏది ఏమైనా తిరిగి బ్రసెల్స్‌కు చేరే నాటికి మార్క్స్‌లో మార్పొచ్చింది. 'ఇప్పటి వరకు తాను చదివిన పుస్తకాలు, తాను మాట్లాడిన మాటల వెనుక నిజమైన మనుషులున్నారు' అన్న సత్యం అనుభవంలోకి వచ్చింది.

మాంచెస్టర్ ప్రయాణం వల్ల కలిగిన మరో లాభం – మార్క్స్, ఎంగెల్స్‌ల స్నేహం దృఢపడింది. అంతకుముందు పది రోజులు వాళ్లు పారిస్‌లో గడిపారు. కాని ఆ తర్వాత కేవలం లేఖల ద్వారానే మాట్లాడుకున్నారు. సమావేశాల్లో, గ్రూపుల్లో మాత్రమే అప్పుడప్పుడు కలిశారు. మాంచెస్టర్ ప్రయాణంలో ఇద్దరిలోనూ మేధోపరంగానే కాదు, వ్యక్తిగతంగా అన్ని అభిరుచుల్లో సారూప్యం కనిపించింది. ఇన్నాళ్లూ వయసులో అనేక సంవత్సరాలు తన సీనియర్లయిన వాళ్లతో మాత్రమే (హెర్వేగ్, బకూనిన్ తప్ప) పని చేశారు మార్క్స్. ఇద్దరి మేధోపటిమ అసామాన్యం. ఇద్దరికీ అసహనం కూడా ఎక్కువే. వ్యక్తిగత జీవితంలో మర్యాదలు, సంప్రదాయాలు పాటించరు. ఎవరేమనుకున్నా పట్టించుకోరు. మాటలు అంత మర్యాదపూర్వకంగా ఉండవు. ఇద్దరికీ పొగాకు అంటే ఇష్టం (ఎంగెల్స్ పైప్ కాలుస్తాడు. మార్క్స్‌కు సిగార్ ఇష్టం. రాత్రంతా కూర్చుని తాగగలరు. (ఎంగెల్స్‌కు వైన్, ఏల్ ఇష్టం. మార్క్స్‌కు ఏదుంటే అదే). ఇద్దరూ కబుర్లరాయుళ్లే. బిగ్గరగా నవ్వుతారు. (ముఖ్యంగా తమ శత్రువులను గాయపర్చటానికి ఇక మార్క్స్ అయితే కన్నీళ్లు కారే దాకా నవ్వాపడు.)

★★★

బ్రసెల్స్, 1846

మనిషి ఏ పని చెయ్యాలన్నా, అన్నింటికన్నా ముందర ఆహారం, నీళ్లు, గృహ వసతి, దుస్తుల అవసరాలు తీరాలి. అంటే మనిషి తన భౌతిక అవసరాలు తీర్చుకోవటానికి ఉత్పత్తి చేశాడన్నది మొదటి చారిత్రక సత్యం. భౌతిక జీవన విధానమే ఇతర అన్ని రంగాలలోని కార్యాచరణనూ శాసిస్తున్నది **– కార్ల్‌మార్క్స్**

సెప్టెంబర్ చివరలో జెన్నీ 'ముష్టివాళ్ల కాలనీ' అని తను పేరు పెట్టిన ఇంటికి తిరిగి వచ్చింది. ప్రసవం దగ్గిర పడింది. తల్లిని ఒంటరిగా వదలటం ఇష్టం లేక, తన తిరుగు ప్రయాణాన్ని కొన్నాళ్లు వాయిదా వేసుకోవటం వల్ల ఆలస్యమైంది. మొదట బ్రసెల్స్ వెళ్లి, అక్కడి నుండి వ్యాపారంలో తన అదృష్టం పరీక్షించుకోవటానికి అమెరికా వెళతానన్నాడు ఎడ్గార్. ఇప్పుడు తన తల్లికి అరవై ఏళ్లు. ఆర్థికంగా చితికిపోయింది. ఒకప్పటి అరిస్టోక్రాట్ దిక్కులేనిదైంది.

జెన్నీకి తల్లంటే ప్రాణం. ఆమెను ఒంటరిగా వదలటం ఎలా అని బాధపడింది. కోపంతో, సమాజంలో మహిళల దైన్య స్థితిని వివరిస్తూ కార్ల్ మార్క్స్‌కో లేఖ రాసింది. అందులో ఆమె తన భర్త రాడికల్ అయిడియాలజీని కూడా వ్యతిరేకిస్తూ స్త్రీలను సమర్థించింది. ఈ రాడికల్ బృందాల్లో ఎప్పుడూ హక్కుల గురించిన చర్చలు కొనసాగుతుంటాయి. కాని అవన్నీ కేవలం పురుషుల హక్కుల గురించి మాత్రమే 'స్త్రీల హక్కుల గురించి తర్వాత మాట్లాడదాంలే' అంటారు. అదే కోపంతో జెన్నీ, ఫ్రాన్సు నుండి తమ బహిష్కరణనూ, బ్రసెల్స్‌లో గాలిలో దీపంలాగా వున్న బతుకుల్నీ ప్రస్తావించింది. భర్తలాగే తనకూ జర్మనీ అంటే అసహ్యమే. కాని ఆ క్షణాన స్వదేశాన్ని సమర్థించింది :

"ఎందుకోగాని జర్మనీలోనే బాగుందనిపిస్తున్నది. నీవంటి జర్మన్ వ్యతిరేకితో ఇలా మాట్లాడటం సాహసమే. ఇక్కడి వాళ్లందరూ దుర్మార్గులైతే కావచ్చు. కాని నాకు నీచాతి నీచమైన వ్యక్తులతో పరిచయమైంది మాత్రం అభ్యుదయ దేశాలైన ఫ్రాన్స్, బెల్జియంలలోనే. ఇక్కడ కూడా మనుషులు నీచంగానే వుంటారు. కాని వాళ్ల ముందు వీళ్ల నీచత్వం ఎంత! అక్కడ కూడా హీరోలకు ఎవరూ నీరాజనాలు పట్టడం లేదు. అక్కడ వ్యక్తులు ఇక్కడి కన్నా మెరుగ్గా జీవిస్తున్నారా అంటే అదీ లేదు. బహుశా, పురుషులకు ఈ మాట వర్తించకపోవచ్చు. కాని స్త్రీలకు (వీళ్ల పని పిల్లల్ని కనటం, వంట చెయ్యటం, ఇంటి చాకిరీ మాత్రమే గద) మాత్రం జర్మనీలోనే ఉండమని సలహా ఇస్తాను."

అయితే ఇలా రాసినంత మాత్రాన ఆమెకు జర్మనీలోనే ఉండాలని కోరిక ఉన్నదని కాదు. తను బ్రసెల్స్‌కు వెళుతుంది. అందులో సందేహం లేదు. నిజానికి కొన్నేళ్ల తర్వాత మార్క్స్ దంపతులకు బెర్లిన్‌కు తిరిగి వచ్చే అవకాశం కలిగినప్పుడు ఆమె తీవ్రంగా ఆ ప్రతిపాదనను వ్యతిరేకించింది. నిజానికి ఆ లేఖలో ప్రస్ఫుటమైంది ఆమె సందిగ్ధత. కూతురిగా, భార్యగా సంఘర్షణ. ఎటూ తేల్చుకోలేని నిస్సహాయత. కాని ఇంక ఎక్కువ సమయం లేదు. ఈ లేఖ రాసే నాటికి ఆమెకు ఎనిమిది నెలలు నిండాయి. ప్రసవం బ్రసెల్స్‌లో జరగాలనుకొంటే వెంటనే బయల్దేరక తప్పదు.

జర్మనీలో వున్న మార్క్స్ 'సోషలిస్టులు మిత్రులు' ఆమె ప్రయాణం సజావుగా సాగటానికి అన్ని ఏర్పాట్లూ చేశారు. వీలైనంత ఎక్కువ విశ్రాంతి కోరుకుంది జెన్నీ. కుదుపులతో ఎక్కువ సేపు ప్రయాణం చేస్తే అనుకోనిదేదైనా జరగొచ్చు. మొత్తంమీద సెప్టెంబర్ 26 నాడు మరో ఆడపిల్లకు జన్మనిచ్చింది జెన్నీ. బిడ్డ పేరు 'లారా'.

ప్రసవానికి ముందర ఈ హడావిడి కార్ల్ పనికి అడ్డు తగులుతుందేమోనని భయపడింది జెన్నీ. భర్తను మధ్య అంతస్తులో పని చేసుకొమ్మని, మొదట చంటిపిల్లతో పైఅంతస్తులోనూ ఆ తర్వాత కింది అంతస్తుకూ వచ్చింది (కార్ల్ రాస్తున్న పుస్తకం పేరు అప్పటికి సింపుల్‌గా 'పొలిటికల్ ఎకానమీ'). అప్పటికే ఆ పుస్తకం గురించి చర్చ జరుగుతున్నది. రాజకీయంగా ఇది ఎంతో ప్రభావం చూపే అవకాశముంది. అంతకన్నా ముఖ్యంగా తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపడొచ్చు. పుస్తకాలు తప్ప వాళ్లకు వేరే ఆదాయం లేదు. మిత్రులు వీలైనంత సాయం చెయ్యటం లేదని కాదు. కాని ఎన్నాళ్లిలా పరుల దాతృత్వం మీద ఆధారపడి బతకటం?



'మీ రచన ఎలా కొనసాగుతున్నది?' అన్న ప్రశ్నకు మార్క్స్ ఎప్పుడూ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. ఎన్నిసార్లడిగినా, 'ఒకటి రెండు వారాల్లో ముగిస్తాను' అనేవాడు. లేదా 'రాసేశాను కాని మెరుగులు దిద్దుతున్నాను' అనీ దాటవేసే వాడు. లేదా ఆర్థిక సమస్యో, మరో సమస్యో వచ్చి పని ముందుకు జరగటం లేదని తప్పించుకునే వాడు. ఎప్పుడూ కొత్త అయిడియాలతో, రాసింది తృప్తిగా లేదనిపించేది. ఒక అయిడియా స్థిరంగా లేనప్పుడు ఎలా రాయటం? కాని నిజంగా అలాగే ఏదో ఒకటి తట్టింది గదా అని రాసుంటే, అంత అత్యద్భుతమైన గ్రంథం మనకు దొరికుండేదా? ఇక ప్రస్తుత విషయానికొస్తే, తను అసలు రచన ప్రారంభించనేలేదనీ, అది కేవలం తన వూహల్లో మాత్రమే ఉందనీ జెన్నీకి చెప్పి వుండడు. నిజానికి పుస్తక రచనకు కాంట్రాక్టు కుదుర్చుకోవటం తన భర్తను నిరుత్సాహ పరుస్తుందని తరువాత తెలుసుకుంటుంది జెన్నీ. ఈ కాంట్రాక్ట్ వ్యవహారం అతణ్ణెంత బాధించిందో ఆమె స్వయంగా చూసింది. అనుభవించింది. (కాంట్రాక్ట్) తేదీ సమీపిస్తున్నదంటే చాలు మార్క్స్ శరీరంలో బొబ్బలు లేస్తాయి. కూర్చోలేక, నిల్చోలేక బాధతో విలవిల్లాడిపోతాడు. కాని 1845లో రచన ఇక పూర్తవుతుంది. కాస్త ఆదాయం వస్తుందని ఆశగా ఎదురు చూసిందామె.

నిజానికప్పుడు మార్క్స్ రాయటం లేదని కాదు. రోజూ రాస్తూనే వున్నాడు. లారా పుట్టినప్పుడు, చంటిపాప ఏడుపులతో ఇల్లు ప్రతిధ్వనించగా, మార్క్స్, ఎంగెల్స్, 'జర్మన్ అయిడియాలజీ' అనే పుస్తకం రాశారు.

జర్మన్ అయిడియాలజీ (తత్వశాస్త్రం) గురించి, తన Theses of Feurbach లోనే ప్రస్తావించాడు మార్క్స్. ఇంగ్లండ్ నుండి తిరిగి వచ్చిన తర్వాత మిత్రులిద్దరూ ఈ జర్మన్ అయిడియాలజీని, దానితో పాటు అప్పటికి ప్రచారంలో వున్న జర్మన్ సోషలిజాన్ని చెత్త బుట్టలో విసిరేయాలనుకున్నారు. గతంలో జరిగిన పోరాటాలన్నింటినీ సరిదిద్దకుండా ముఖ్యంగా యంగ్ హెగెలియన్ల గురించి స్పష్టత ఇవ్వకుండా పొలిటికల్ ఎకానమీ పుస్తకం రాయటం సాధ్యం కాదని అప్పటికే తన ప్రచురకర్త కార్ల్ లెస్క్‌కు స్పష్టం చేశాడు మార్క్స్. కాని ఇంకా చెప్పవలసింది వుంది. ఈసారి ఇద్దరూ కలిసి ఆ ప్రయత్నానికి పూనుకున్నారు.

(సశేషం)

తెలంగాణ తొలి తెలుగు పత్రికలు
శేద్యచంద్రిక, హితబోధిని

శేద్యచంద్రిక (1886) : తెలంగాణ ప్రాంతం నుండి వెలువడిన తొలి తెలుగు పత్రిక 'శేద్యచంద్రిక' గురించిన సమాచారం చాలా ఆలస్యంగా (1995లో) వెలుగులోకి వచ్చింది. అయితే ఇది రెండు మూడు సంచికలతోనే ఆగిపోయినట్లు తెలుస్తున్నది. ఉర్దూ పత్రిక 'ఫునూన్'తో పాటు రైతుల ఉపయోగం కొరకు (శేద్యుల క్షేమం నిమిత్తం) తెన్గు భాష లో మున్షీ మహ్మద్ ముస్తాక్ అహ్మద్ మాలిక్ వెలువరించారు. ఉర్దూ మిశ్రితమైన సరళ భాషలో వ్యవసాయ రంగానికి సంబంధించిన వార్తలు ఇందు ప్రచురితమైనాయి. మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో దీని ప్రతి ఉన్నట్లు ఆకాశవాణి కార్య నిర్వహణాధికారి డా॥పి.ఎస్. గోపాలకృష్ణ వెల్లడించగా, తోట భావనారాయణ అతి కష్టం మీద (ఆరువేల పుస్తకాల్లో వెతికి) నలభై పేజీల ఈ ప్రతికను సంపాదించి ఆంధ్ర ప్రభ ఆదివారం పత్రికలో (తెలంగాణలో తొలి తెలుగు పత్రిక (26-11-1995) సాహితీ లోకానికి పరిచయం చేశారు. దీని జిరాక్స్ ప్రతిని పొందిన సంగిశెట్టి శ్రీనివాస్ దీని కాలాన్ని 1886 ఆగస్టుగా నిర్ధారించి తన 'షబ్నవీస్' గ్రంథంలో (అక్టోబర్ 2003) దీనికి సంబంధించిన విపులమైన సమాచారాన్ని అందించారు.

హితబోధిని (1913-14) : శేద్యచంద్రిక పత్రిక కనుమరుగు కావటంలో పాలమూరు జిల్లా నుంచి వెలువడిన మాస పత్రిక 'హితబోధిని'కి తొలి తెలుగు పత్రిక అన్న కీర్తి లభించింది. తెలంగాణ ప్రాంతంలో ప్రప్రథమంగా కథానికలు ప్రచురించిన ఖ్యాతిని పొందటమే కాక ఏడాదిపాటు నిర్విఘ్నంగా పత్రిక కొనసాగటం వల్ల కూడా ఈ పత్రికకు ఆ గౌరవం దక్కింది. కోయిల్‌పల్లి సమీపంలోని ముష్టిపల్లి జమీందారు బి. శ్రీనివాసశర్మ(రావు) తన కూతురు పేరిట జిల్లా కేంద్రంలో నెలకొల్పిన సరోజిని విలాస ముద్రాక్షర శాలనుండి (ఎస్.వి.ప్రెస్) 1913 మే నెలలో ఈ పత్రికను ప్రారంభించారు. ఆయన అభ్యర్థనపై ఈ ముద్రణాయంత్రాన్ని ఒసగిన ఆత్మకూరు రాజా రాంభూపాలరావు బహద్దూరు రాజ పోషకులుగా, బి.నారాయణరావు (బహుశా శ్రీనివాసరావు సోదరులు కావచ్చు) యజమానిగా ఉన్న 'హితబోధిని' పత్రిక సంపాదకీయంలో దీనికి ఆర్థికంగా, హార్దికంగా సహకరించిన వారి పేర్లనెన్నింటినో పేర్కొన్నారు. మధ్వ బ్రాహ్మణులు, ఆయుర్వేద డాక్టరు, సంస్కృతాంధ్రభాషాకోవిదులు అయిన శ్రీనివాసరావు అక్షరాస్యత అతి స్వల్పంగా ఉన్న రోజుల్లో (వంద సంవత్సరాల క్రితం) ఈ పత్రికను నడపడం సాహసకార్యమే అని చెప్పాలి.

"వ్యవసాయము, వైద్యము, పారిశ్రామికము, సంఘసంస్కరణము యను నాల్గు విషయంబులచే నిండి యుండును" అని ప్రారంభ సంచిక ముఖ పత్రంలో పేర్కొన్న సంపాదకులు ఈ ఆశయాన్ని అక్షరాలా పాటించారు. వ్యవసాయ పద్ధతులు, ఎరువులు, విత్తనాలు మొదలైన అంశాలకు సంబంధించి రైతులకు అవగాహన కలిగించే వ్యాసాలు ఇందుండేవి. స్వయంగా డాక్టరు అయిన సంపాదకుడు సరియైన పరిజ్ఞానం లేకుండా వైద్యం చేసే డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, ప్రజల కోసం ఆయుర్వేద వైద్యశాలలు స్థాపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తాను స్వయంగా తయారు చేసిన 'కుసుమ శర విలాసం' మందుతో పాటు ఇతర కంపెనీల ఆయుర్వేద మందుల ప్రకటనలు ఇందుండేవి. అగ్గిపుల్లలు, సబ్బు బిళ్లలు తయారు చేయటం, అద్దాలకు పాదరసం పూయటం వంటి కుటీర పరిశ్రమల విజ్ఞానానికి సంబంధించిన రచనలు ఇందు ప్రచురితమైనాయి.

సంఘ సంస్కరణ భావ ప్రచారానికి హితబోధిని పత్రిక పెద్ద పీట వేసింది. రత్నమాంబ దేశాయి రాసిన 27 పద్యాల ఖండికను, స్త్రీ విద్య గురించి ఎస్.సుందరీబాయి అనే మహిళ రాసిన వ్యాసాన్ని ప్రచురించటం సంపాదకుల మహిళాభ్యుదయ దృక్పథాన్ని ద్యోతకం చేస్తుంది. 'రెడ్డిగారి ప్రహసనము' అనే నాటికలో మూఢ నమ్మకాలపై విమర్శ వుంది. కర్త పేరు లేకుండా ముద్రితమైన సంస్కార భావాలతో కూడిన నాలుగు కథలు శ్రీనివాసరావు రాసి ఉంటాడని పరిశోధకులు భావిస్తున్నారు. 'విషాదము' అనే కథానికలో అక్రమ సంతానాన్ని వదిలించుకోవాలని చూసిన బ్రాహ్మణుడు ఒక వితంతు స్త్రీ పోలీసులను ఆశ్రయించడంలో అతడు ఆ బిడ్డను సొంతం చేసుకునేలా ప్రయత్నించిన వృత్తాంతం వుంది. నకిలీ డాక్టర్ల మూలంగా కలిగే నష్టాలను వివరిస్తుంది 'కువైద్యరాజ ప్రహసనం' అనే కథ. 'రాజయసోమయాజులు' కథలో బాల్య వివాహ ఖండన గోచరిస్తుంది. 'మృత్యువు – దాని గురించిన జ్ఞాపకము' మ్యూజింగ్స్ వంటి రచన.

'హితబోధిని' మాస పత్రిక వెల ఎనిమిది అణాలు కాగా, సంవత్సర చందా ఐదు రూపాయలు (స్త్రీలు, విద్యార్థులకు మూడు రూపాయలు మాత్రమే). ప్రారంభంలో ఐదు వందల మంది చందాదారులు ఉన్నా క్రమంగా వారి సంఖ్య తగ్గిపోవటంతో పత్రిక ఎక్కువ కాలం మనలేకపోయింది. 'వీరలోక నాటకమండలి' అనే డ్రామా కంపెనీని స్థాపించి నాటకాల ద్వారా వచ్చే డబ్బుతో నడపాలన్న ప్రయత్నం కూడా ఫలించలేదు. నిజాం ప్రభుత్వ వ్యవసాయ శాఖాధికారి జాన్ కెన్నీ స్క్వేయర్, రెవెన్యూ అధికారి విక్ఫీల్డ్‌ల ప్రోత్సాహం కూడా పత్రికను గట్టెక్కించలేకపోయింది. సురవరం ప్రతాపరెడ్డిగారు 1950 సుజాత పత్రికలో 'తెలంగాణములోని తొలి తెలుగు పత్రిక 'హితబోధిని' నాల్గవ సంచిక (1913 సెప్టెంబర్) మాత్రమే తన వద్ద గలదు అని రాశారంటే అప్పటికే ఈ పత్రిక ప్రతులు అలభ్యంగా వున్న సంగతి అవగతమవుతుంది. రాజమండ్రి గౌతమీ గ్రంథాలయంలో దీని సంచికలు చూసిన పత్రికా పరిశోధకులు పొత్తూరి వెంకటేశ్వరరావు గారు 'వివిధ విభాగాల శీర్షికలతో కూడిన ఇంత మంచి పత్రిక ఒక్క ఏడాది మాత్రమే నడవటం దురదృష్టకరం' అని (తెలుగు పత్రికలు పు.221, 495) ఉగ్గడించారు. తనకు లభించిన సంచికల ఆధారంగా సంగిశెట్టి శ్రీనివాస్ తెలంగాణ పత్రికారంగ చరిత్ర 'షబ్నవీస్'లో (2003) హితబోధిని గురించిన అమూల్య సమాచారాన్ని వెల్లడించారు. సంపాదకులు బండారు శ్రీనివాసరావు 'ఆశాదీపం' అన్న నవల కూడా రచించినట్లు తెలుస్తున్నది కాని ప్రస్తుతం అది అలభ్యం.

– ఆచార్య ఎస్వీ రామారావు, 9848012053

■ **సంగీతం**

లూర్ద్ మేరీ అంటే ఎవరికీ తెలీదు. కానీ ఎల్.ఆర్.ఈశ్వరి అంటే వెంటనే సినిమాల్లో ప్రత్యేకమైన పాటలు, ఐటమ్ సాంగ్స్ గుర్తొస్తాయి. ఆమె గాత్రంలోనే ఓ రకమైన జీర, మత్తు ఉందా అనిపిస్తుంది. తెలుగు, తమిళ్, కన్నడం, మళయాళం, హిందీ, తుళు, ఆంగ్ల భాషల్లో మొత్తం 30 వేలకు పైగా పాటలు పాడారు ఎల్.ఆర్.ఈశ్వరి. ఈమె పాడిన పాటల్లో అధికంగా సోలో పాటలు, అది కూడా జ్యోతిలక్ష్మి, జయమాలిని, సిల్క్‌స్మిత వంటి డాన్సర్లు నటించిన ఐటమ్‌సాంగ్స్‌కు పాడారు. 'దొంగలున్నారు జాగ్రత్త (1958) చిత్రంతో తెలుగులో పాటలు పాడడం ప్రారంభించారు.

గ'మ్మత్తై'న పాటల గాత్రధారి

జీవితంలో వరుసగాఎదురు దెబ్బలు తగిలినప్పుడు వచ్చే కోపం, బాధ, అందులోనుండి వచ్చే కసి... దాంతో పాటే జీవితంపై వచ్చే నిర్లక్ష్యం... ఇవన్నీ కనిపించే పాట జయప్రద, కమల్ హాసన్, ఫటాఫట్ జయలక్ష్మి, రజనీకాంత్ నటించిన 'అంతులేని కథ' చిత్రంలోని "ఏమిటిలోకం పలుగాకుల లోకం... మమతన్నది వట్టి పిచ్చి, మనసన్నది మరో పిచ్చి". ఆత్రేయ సాహిత్యానికి ఎమ.ఎస్.విశ్వనాథన్ సంగీతం అందించారు.

సమాజంలో కనిపించేదంతా నిజంకాదనీ, పైపై మెరుగులు చూసి నమ్మితే మోసపోవడం తప్పదని తెలిపే పాట 'జీవన తరంగాలు' చిత్రంలో "నందామయా గురుడ నందామయా.. ఉందామయా తెలుసుకుందామయా...". డా॥ సి.నారాయణరెడ్డి రాసిన పాటకు జె.వి.రాఘవులు సంగీతం సమకూర్చారు. కాస్త వేదాంతంతో కూడిన సాహిత్యమున్న ఈ పాట ఎల్.ఆర్.ఈశ్వరి గొంతులో ప్రాణం పోసుకుందా అన్నటుంది. అప్పట్లో ఈ పాట బాగా పాపులర్ అయింది కూడా.

మనసుపడ్డ వాడిని ఉడికిస్తూ, తన మనసులోని ఇష్టాన్ని తెలుపుతూ టీజింగ్‌గా పాడే పాట శోభన్‌బాబు, కృష్ణ, లక్ష్మి, చంద్రకళ నటించిన 'పుట్టినిల్లు మెట్టినిల్లు' చిత్రంలో "బోల్తా పడ్డావు బుజ్జినాయినా చెమ్కీ తిన్నావు చిన్ని నాయినా...".

ఎల్.ఆర్.ఈశ్వరికి బాగా పేరు తెచ్చిన పాటలు 'ప్రేమ్‌నగర్' చిత్రంలోని "లేలేలే నారాజా", 'రౌడీలకు రౌడీ' చిత్రంలో "తీస్కో కోకోకోలా, వేస్కో రమ్ము సోడా", 'దేవుడు చేసిన మనుషులు' చిత్రంలో "మసక మసక చీకటిలో", 'మరో చరిత్ర'లోని "భలెభలే మగాడివోయ్ బంగారు

నాసామివోయ్", భార్యాబిడ్డలు' చిత్రంలో "ఆకులు పోకలు ఇవ్వొద్దు... నోరు ఎర్రగ చెయ్యొద్దు..." 'బంగారు గాజులు' చిత్రంలో "జాజిరి జాజిరి జక్కల మావా", లాంటి ఎన్నో హుషారైన, ప్రేక్షకులను ఉర్రూతలూగించే పాటలు పాడిన ఎల్.ఆర్.ఈశ్వరికి ఒకే రకమైన పాటలు పాత్రమే పాడగలదనే ముద్ర పడిపోయింది. కుటుంబ అవసరాల రీత్యా అవివాహితగా మిగిలిపోయిన ఈమెకు సరైన గుర్తింపు రాలేదనే చెప్పాలి.

(నేడు ఎల్.ఆర్.ఈశ్వరి పుట్టినరోజు)

కొన్ని...

➡ ఏ విషయమైనా కొత్తగా ఉన్నప్పుడే బాగుంటుంది. స్నేహం మాత్రం పాతబడిన కొద్దీ బాగుంటుంది.

➡ చదవడమంత చౌకగా లభించే వినోదం లేదు. చదవడం వల్ల లభించే ఆనందానికి అంతేలేదు.

➡ మనిషి సాధించిన విజయాలు సమాజానికి ఉపయోగపడితే అవే నిజమైన విజయాలు.

➡ అందరిలోనూ మంచి చూడడమే నేర్చుకుంటే మనలోని మంచి పెరుగుతుంది.

➡ చదరంగం మాదిరిగానే జీవితంలోనూ ముందు చూపు అవసరం.

➡ దురలవాట్లను తొందరగా వదిలించుకోకపోతే అది అవసరంగా మారుతుంది.

➡ అజ్ఞానం ఎప్పుడూ మార్పుకు భయపడుతుంది.



■ సృజన

పసిడి ఛాయల పైన పాల వెన్నెల మేలి ముసుగేసినట్లుండే ప్రకాశ వంతమైన లోహం ప్లాటినం. రంగు కన్నా గుణం ప్రదానమన్న తాత్వికతను పులుముకొని చక్రవర్తుల మృత దేహాలపై గుడారాలుగా నిలిచే 'కాస్కెట్' లపై ధవళ కాంతులతో మెరుస్తూ, వారి అస్తిత్వాన్ని గుర్తు చేసే ఆనవాలు ప్లాటినం. అటువంటి ఈ అరుదైన లోహపు అస్తిత్వాన్ని మాత్రం ఆధునిక సమాజం ఆలస్యంగా గుర్తించింది.

నవీన నగల శైలి ప్లాటినం

రాజ కుటుంబీకుల పార్థివ శరీరాలను భద్రపరచడానికి ఒక ప్రత్యేకమైన పెట్టెను (కాస్కేట్ అఫ్ తేబెస్) ఈజిప్ట్ రాజ వంశీకులు తయారు చేసేవారు. శవాన్ని పెట్టే ఈ కాస్కేట్ పై భాగాన్ని, విలువైన లోహాలతో, రంగులతో అందంగా తయారు చేసేవారు. ఈ పెట్టె పై భాగం సమాధి పైనే దర్శనమిస్తుంది. ఒకటికి మించిన అరలతో ఉండే ఈ పెట్టె కింది అరలో చనిపోయిన రాజ కుటుంబీకుల శరీరం ఉంటుంది. అది భూమి లోపల పాతి పెట్టబడి, పై భాగం మాత్రం పైన సమాధిలా దర్శనమిస్తుంది. ఈ భాగాన్ని 'కాస్కేట్ అఫ్ తేబెస్' అంటారు. ఆధునిక, నాగరిక ప్రపంచానికి ఈ ప్లాటినం 18 వ శతాబ్దంలో పరిచయమైనా, నిజానికి ఈ అరుదైన లోహం క్రీ.పూ.700 కాలం లోనే ఈజిప్ట్ రాజ వంశీయులు తమ 'కాస్కేట్ అఫ్ తేబెస్' లో వాడటం జరిగింది. 'కాస్కేట్ అఫ్ తేబెస్' లో పూతగా వాడబడిన ఈ తెల్లని లోహాన్ని వెండి లేదా హీనదశలో ఉన్న లేదా వన్నె తగ్గిన బంగారపు రేణువులుగా భ్రమపడేవారు. మొట్టమొదటగా ఈ లోహాన్ని గ్రంథస్తం చేసిన యూరోపియన్ వ్యక్తి జూలియస్ సీజర్ స్కాలిగేర్. ఇతను 1557 సంవత్సరంలో మధ్య అమెరికా ప్రాంతీయులు ప్లాటినం లోహాన్ని నగల తయారీకి ఉపయోగించడం చూశాడు. ప్లాటినం పేరు స్పానిష్‌కు చెందినా 'ప్లాటిన' పదం నుండి వచ్చింది. ప్లాటినం అనగా వెండి రేణువులు. దీనినే వన్నె తగ్గిన బంగారంగా గుర్తించేవారు. ఈ అరుదైన లోహానికి అప్పటి కాలంలో సరియైన విలువనివ్వలేదు. అదే లోహం ఇప్పుడు అటు అంతర్జాతీయంగా ఇటు దేశీయంగా వెరైటీ డిజైన్‌లతో ఆధునిక ఫ్యాషన్ ప్రపంచంలో సంచలనం సృష్టిస్తూ నవతరాన్ని ఆకర్షిస్తున్నది. 'ట్రెండ్', 'బ్రాండెడ్', 'మోడరన్' పేర్లతో డిజైన్‌లు కలిగి పసుపు పచ్చని పసిడి వన్నెకు దీటుగా స్వచ్ఛమైన లేత బూడిద రంగు ఛాయ కలిగి ధవళ కాంతులతో బంగారు నగల గగన వీధిలో మెరిసే పాలపుంతలుగా ప్లాటినం ఆభరణాలు ప్రశస్తి పొందుతున్నాయి. నవతరానికి చెందిన ఆధునిక మనోభావాలకు తగిన విధంగా ఈ తరహా డిజైన్ ఔట్ లెట్స్ రోజురోజుకి పెరిగి ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయి. ముఖ్యంగా పాశ్చాత్య దేశాలలోని మోడలింగ్ రంగంలో అందాల పోటీలలో, బ్యూటీషోలతో పాటు ఫ్యాషన్ డిజైన్ ప్రదర్శనల లోను పోటీగా నిలిచి ఆధునికతకు ప్రతీకగా ఉండే నగ ప్లాటినం తీగ .

ప్లాటినం భూమి లోపలి పొరల్లో లభించే అన్ని మూలకాల్లో అత్యంత అరుదైన మూలకం. అత్యంత విలువైన లోహం కూడాను. అలాంటి ప్లాటినం నిక్షేపాలకు ప్రపంచంలోనే దక్షిణాఫ్రికా ప్రథమ స్థానంలో ఉంది .

బంగారం, వెండి, వజ్రాల నిక్షేపాలకు ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దక్షిణాఫ్రికా – ప్లాటినం వర్గానికి చెందిన మూలకాలకు అంటే పల్లాడియం, రేడియం, రుథీనియం, అస్మియం, ఇరిడియంలకు కూడా పేరు పొందింది. 'ట్రాన్స్ వాల్' ప్రాంతం లోని 'బుష్ వెల్డ్ కాంప్లెక్స్' లోపలి 'మెరెన్ స్కి భిత్తికలో' క్రోమియంకు మూలధాతువైన క్రోమైట్ ను వెలికి తీసే 'రాస్టేన్ బర్గ్ ప్లాటినం మైన్స్ లిమిటెడ్ సంస్థ' ఇక్కడి నుంచి క్రోమైట్‌తో బాటు సుమారు టన్నుకు 0.25 troy.oz ప్లాటినం గ్రూప్‌కు చెందినా లోహాలను ఉపఫలం (by product) గా ఉత్పత్తి చేస్తుంది. వీటిలో దాదాపుగా 72 శాతం ప్లాటినం ఉంటుంది. ద్వితీయ స్థానంలో వున్న రష్యాలోని 'నోరిల్ సెక్' ప్రాంతంలో రాగి – నికెల్ నిక్షేపాలలో టన్ను రాగి – నికెల్ ముడి ఖనిజానికి పదకొండు గ్రాముల ప్లాటినం ఉత్పాదక మూలకంగా వెలికి వస్తుంది .

2013 సంవత్సరపు లెక్కల ప్రకారం ప్రపంచంలో ప్లాటినం వనరులు 73,000 టన్నులు కాగా అందులో దక్షిణాఫ్రికాలోనే 63,000 టన్నులు (86%) రష్యాలో 1100 టన్నుల ప్లాటినం ఉత్పత్తి జరుగుతోంది. దక్షిణాఫ్రికా, రష్యాల తరువాత ప్లాటినం వనరులు కలిగిన ప్రముఖ దేశాలు అమెరికా – 900 టన్నులు, కెనడా – 310 టన్నులు, ఇతర దేశాలు 800 టన్నుల ప్లాటినం ఉత్పత్తి జరుగుతోంది. 2002 సంవత్సరపు లెక్కల ప్రకారం అమెరికాలో 2200 టన్నుల నుండి 900 టన్నులు కెనడాలో 390 టన్నుల నుండి 310 టన్నులకు తగ్గినట్లు గమనించవచ్చు. ప్లాటినం వార్షిక ఉత్పత్తి 130 టన్నులు అనగా ప్రపంచపు పశ్చిమ దేశాల బంగారం ఉత్పత్తి లో 6% మాత్రమే.

భారతదేశంలో ప్లాటినం ఉత్పత్తి చెప్పుకోదగ్గ స్థాయిలో లేకున్నా ప్రస్తుత జిఎస్ఐ పరిశోధనల ఫలితంగా కర్ణాటక లోని హనుమలపుర ప్రాంతంలో 0.84 మిలియన్ టన్నుల ముడి ధాతువు గలదని నిర్ధారించడమైనది. తమిళనాడు లోని నమక్కల్, ఈరోడ్, కోయంబత్తూర్ జిల్లాలలోగల చేట్టియం పాలియం, మెట్టుపాలియం ప్రాంతాలలో ప్లాటినం వనరులు దొరికే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి .

ఒరిస్సా లోని 'సుఖిందా', 'బౌలా–నౌషాహి' సెక్టార్‌లలో దాదాపు 14

మిలియన్ టన్నుల ప్లాటినం ధాతు ఖనిజం గల సంభావ్యత వనరులను నిర్ధారించారు. దక్షిణ గోవా లోని 'ఉస్ గావ్'లోను, మహారాష్ట్రలోని భాంద్రా జిల్లా భీమ సాయిరి, ఖిల్లాపహర్‌లో ప్లాటినం గ్రూప్‌కు చెందిన లోహాలు లభ్యమయ్యే నైసర్గిక సూచనలు కనిపించటంతో ఆ దిశగా పరిశోధనలు సాగుతున్నాయి. కర్ణాటకలోని షిమోగా జిల్లాకు చెందిన తావరగేరే, మసానికేరే, మాగ్యతహళ్లి ప్రాంతాలలోను ప్లాటినం లభ్యమయ్యే ఆనవాళ్లున్నాయి. ప్రపంచ దేశాలలో ప్లాటినం ఉత్పత్తి ఇలా వుండగా అత్యధికంగా వినియోగించే దేశాలలో చైనాది మొదటి స్థానం, కాని ఆభరణాల తయారీకి మాత్రం జపాన్ ప్లాటినం వినియోగించడంలో ప్రథమ స్థానంలో వుంది. ఆ తర్వాత యునైటెడ్ కింగ్‌డం, యునైటెడ్ అరబ్ ఎమిరట్స్, స్విట్జర్లాండ్, జర్మనీ, ఆస్ట్రేలియా, తదితర దేశాలు ప్రముఖ దిగుమతి దారులుగా ఉన్నాయి. ఆభరణాల తయారీలో ప్లాటినం ప్రధాన పాత్ర వహిస్తున్నా, శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో వీటి వాడకం అధికం. ముఖ్యంగా ఆటోమొబైల్, రసాయనిక పరిశ్రమలలో, పెట్రోలియం శుద్ధి చేసే కర్మాగారాలలో, కాలుష్య నివారణ యంత్రాలలో ఉత్ప్రేరకంగా ప్లాటినం, పల్లాడియం అధికంగా వాడటం జరుగుతోంది.

లోహాలు రసాయనికంగా జడత్వ లక్షణాన్ని కలిగి ఉండటం చేత, అధిక ఉష్ణోగ్రతను తట్టుకునే గుణం కారణం గాను ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలలోనే కాకుండా దంత వైద్య , ఇతర వైద్య రంగాలలో దీని వాడకం గణనీయంగా వుంది. కాన్సర్ చికిత్సా విధానమైన కీమోథెరపీలో ప్లాటినం గ్రూప్ లోహాల వాడకం ప్రశస్తి పొందింది. స్థూలంగా మూలధాతువు నుండి ప్లాటినం, ఈ వర్గానికి చెందిన ఇతర లోహాలను వేరుపరచడం గురించి తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది. ముందుగా ధాతువు నుండి తీసిన సహజ ప్లాటినం వర్గ లోహాలను వాటికి సమతూకంలో వున్నా గెలీనతో 'రివర్బరెటరీ ఫర్నేస్'లో మొదట శుద్ధి చేస్తారు. సీసపు ధాతువైన గెలీనలోని సీసాన్ని లోహపు స్థితిలోకి మార్పు చెందించి ప్లాటినం గ్రూప్ కు చెందిన లోహాలైన ప్లాటినం, రోడియం, పల్లాడియం , ఇరిడియంలతో మిశ్రమ లోహంగా చేస్తారు. ఇదే గ్రూప్‌కు చెందిన మరో మూలకం అస్మిరిడియం సీసంతో సంయోగం చెందక అడుగుకు చేరుకుంటుంది. ద్రవరూపంలోని ఈ మిశ్రమంలో ఉన్న కలుషిత పదార్ధాలను సిలికా, బోరాక్స్‌లను కలిపి ఫ్లక్స్ రూపంలో వేరు చేస్తారు. ఆ తర్వాత మిగిలివున్న సంక్లిష్టమైన రసాయనిక ప్రక్రియల ద్వారా పరిశుభ్రమైన ప్లాటినం మార్కెట్‌లోకి వస్తుంది. ఆ విధంగా వచ్చిన ప్లాటినం తనదైన విశిష్ట కాంతులతో బూడిద రంగు ఛాయతో తెల్లగా మెరుస్తూ బంగారం కన్నా దాదాపుగా చాలా అధిక ధరతో చెలామణి అవుతుంది. ఒక ఔన్సు అనగా 28.35 గ్రాముల బరువు గల ప్లాటినం లోహాన్ని వెలికి తీయడానికి 10 టన్నుల ముడి ఖనిజ ధాతువు అవసరమవుతుంది . వీటిని కరిగించి రసాయనిక ప్రక్రియకు గురి చేసి శు ద్ధి చేయ వలసి వుంటుంది. ఈ ప్రక్రియకు పట్టే కాలవ్యవధి సుమారుగా ఆరు నెలలు.

అంతర్జాతీయ వాణిజ్య సర్వేల ప్రకారం 2001 లో ప్లాటినం ఆభరణాల రంగంలో అమెరికా ప్రధాన కొనుగోలుదారుగా ఉండగా ప్రస్తుతం 2013 నాటికి జపాన్ అగ్రస్థానం లో వుంది. ప్రపంచ వ్యాప్తంగా ఆభరణాల కొనుగోలు దారులలో 76 శాతం మంది బంగారు, ఇతర నగలతో బాటు ప్లాటినం నగలపై కూడా మోజు పడుతున్నారని ఆ సర్వేలలో వెల్లడయ్యింది. అంతర్జాతీయ సంస్థ ఐన 'ప్లాటినం గిల్డ్ ఇంటర్ నేషనల్' భారతదేశం లోని ప్రజలకు ఆభరణాలపై అధిక మోజు ఉండటం గమనించి ప్లాటినంతో చేసిన నగల వ్యాపారాన్ని విస్తృత పరిచే దిశలో ముందుకు వచ్చి ప్లాటినం ఆభరణాలలో ప్రఖ్యాతి గాంచిన ట్రెండీ, బ్రాండెడ్, మోడ్రన్ డిజైన్‌లను భారతదేశంలోని ప్రధాన నగరాలలో ప్రముఖ వ్యాపార సంస్థలతో కలిసి ప్రవేశ పెట్టింది. ప్రపంచ వ్యాప్తంగా ప్లాటినం బ్రాండెడ్ ఆభరణాల వ్యాపార రంగంలో 80 నుండి 100 శాతం వరకు వార్షిక పెరుగుదలను కొన్ని నగల నిర్మాణ సంస్థలు చవిచూసాయి. కాగా పారిశ్రామిక రంగంలో ఈ పెరుగుదల కేవలం 25 నుండి 30 శాతం మాత్రమే వుంది.

మొత్తం ఆభరణాల మార్కెట్‌లో జరిగిన వ్యాపారం దాదాపుగా 60,000 కోట్లు కాగా ప్రపంచపు ప్లాటినం మార్కెట్ లో భారతదేశం పాత్ర కేవలం ఒక శాతం కన్నా తక్కువే. ఐనను పారిశ్రామిక రంగంలో ప్లాటినం వాడకం 50% కాగా, ఆభరణాల రంగంలో 40 % . పెట్టుబడి గా ప్లాటినం ను 10 % మాత్రమే అని అంచనా వేశారు. భారతదేశపు ఆర్థిక రంగంలోని అభివృద్ధిని, ఇక్కడి నగల సంస్కృతిని దృష్టిలో పెట్టుకొని వాణిజ్యపరంగా బంగారు, వెండి, వజ్రాల ఆభరణాల మార్కెట్‌లో భారత్ ప్రముఖ స్థానంలో వున్న దృష్యా అంతర్జాతీయ సంస్థయైన 'ప్లాటినం గిల్డ్ ఇంటర్ నేషనల్ తన వ్యాపారాన్ని త్వరితగతంగా దేశంలో అభివృద్ధి పరిచేదిశగా ముందడుగు వేస్తోంది. ప్లాటినం, బంగారం, పింక్ గోల్డ్ – ప్లాటినం కాంబినేషన్‌లతో వజ్రాలు పొదిగిన బ్రేస్‌లెట్స్, ఉంగరాలు, కర్ణాభరణాలు, కంఠాభరణాలు అత్యంత ఆకర్షణీయమైన డిజైన్‌లతో వ్యాపారం వృద్ధి చెందడానికి 'గిల్డ్' తరపున భారత దేశానికి చెందిన అతి పెద్ద సంస్థలు ముందుకు వచ్చాయి.

'ఇంటర్ గోల్డ్ ఇండియా లిమిటెడ్' అందులో ఒక ప్రధాన సంస్థ. ఈ నేపథ్యంలో భారతదేశపు ప్లాటినం డిమాండ్ 2017 వరకు 80 టన్నులు 2025కు 120 టన్నులు చేరుకునే అవకాశాలున్నాయని, వినియోగం పెరుగుదల ప్రధానంగా ఆభరణాల రంగంలో, ఇన్వెస్ట్‌మెంట్ సెక్టార్లలో ఉంటుందని 'మినరల్ ఎక్స్ ప్లో రేషన్ అండ్ డెవలప్ మెంట్ రిపోర్ట్' అంచనా. యువతుల అందాన్ని రెట్టింపు చేసి, మనసుకు ఆహ్లాద పరిచే ప్లాటినం వైపు యువకులు కూడా మొగ్గు చూపుతున్నారు. సమాజంలో హోదాని పెంచే ప్రతీకగా ప్లాటినం, ఇండియన్ మార్కెట్‌లో గ్రాముకు దాదాపుగా 3900 నుండి 4000 రూపాయలు కనీస విలువ కలిగి పై మధ్య (upper middle class) తరగతి వారికి గుడా అందుబాటులోకి వస్తోందన్న మాట వాస్తవం.

– డా॥రూప్ కుమార్ డబ్బీకార్, 9908840186

జ్యువెలరీ గ్రీటింగ్ కార్డులు



ఇప్పుడంతా శుభాకాంక్షలు చెప్పుకునే సమయం. అంటే డిసెంబర్ 25 క్రిస్‌మస్, జనవరి 1 న్యూ ఇయర్, ఆ తర్వాత బోగి, పొంగల్ శుభాకాంక్షలు చెప్పుకోడానికి గ్రీటింగ్ కార్డులు ఉపయోగిస్తుంటారు. పాత డిజైన్ల గ్రీటింగ్ కార్డులతో విసుగెత్తిపోయారా? అయితే ఇప్పుడు సరికొత్త జ్యువెలరీ గ్రీటింగ్ కార్డులు కూడా వస్తున్నాయి. ఇవి త్రీ డైమెన్షనల్ గ్రీటింగ్ కార్డులు. ఈ పేపర్ గ్రీటింగ్ కార్డులోనే చేతి వేలికి పెట్టుకునే రింగు కూడా వుంటుంది. రింగులా డిజైన్ చేసిన భాగాన్ని గ్రీటింగ్ కార్డునుండి వేరుచేసి, దాన్ని రింగులా చుట్టి వేలికి పెట్టుకోవడమే. రంగులు కొన్నే ఉన్నా రకరకాల డిజైన్లలో లభిస్తున్నాయి. ఆత్మీయులకు ఈ గ్రీటింగ్ కార్డులతో శుభాకాంక్షలు చెప్తే సంతోషంతో పాటు ఆశ్చర్యపోవడం వారి వంతు అవుతుంది మరి.

అతి పెద్ద మెట్ల బావి

మెట్ల బావిని చూశారా? ఎప్పుడో అమ్మమ్మ, తాతమ్మల నాటి బావులు కదా, ఇప్పుడెక్కడున్నాయి అనే సందేహం వస్తుందెవరికైనా. నిజమే ఇప్పుడు మామూలు బావులే లేవు, ఇక మెట్లబావి అనే మాటకు తావేలేదు. కానీ ఒక చోట మాత్రం చాలా పెద్దదైన మెట్ల బావిని చూడొచ్చు. ఆ ప్రదేశం జైపూర్‌కి 95 కిలోమీటర్ల దూరంలోని అభానేరి గ్రామం. ఈ మెట బావి పేరు 'చాంద్ బవోరి'. దీన్ని ఎనిమిదో శతాబ్దంలో నిర్మించారు. మన దేశంలో ఇదే అతిపెద్ద మెట్ల బావి. వంద మీటర్ల లోతులో, 3500 ఇరుకైన మెట్లతో ఉంది. ఆనాటి నిర్మాణ శైలికి ఇదొక ఉదాహరణ మాత్రమే. చెప్పుకోడానికి రాజస్థాన్ ఎడారి ప్రాంతమైనా ఎన్నో ఆకర్షణీయమైన ప్రదేశాలున్నాయి.

ఆమ్లెట్ వేయడంలో ఫస్ట్

ఆమ్లెట్.... పేరు చెప్పగానే నోరూరిపోతుంది పిల్లలకైనా, పెద్దలకైనా. కానీ రుచికరమైన ఆమ్లెట్ వేయాలంటే అంత ఈజీ ఏం కాదు. కొంచెం కష్టపడాల్సిందే. కానీ 72 ఏళ్ల హోవార్డ్ హెల్మర్ మాత్రం చిటికెలో ఆమ్లెట్ వేసి అందరినీ ఆశ్చర్యపరుస్తాడు. ఆమ్లెట్ ఎంత వేగంగా అంటే ముప్పై నిమిషాల్లో 427 ఆమ్లెట్లు వేస్తాడు. ఇలా వేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు కూడా సాధించాడు. హెల్మర్ అమెరికన్ ఎగ్ బోర్డ్‌లో పనిచేస్తున్నప్పటి నుండి అంటే 42 ఏళ్ల నుండి కోడిగుడ్లతో పని చేయడం మొదలు పెట్టాడు. గొప్ప గొప్ప చెఫ్‌లతో పనిచేశాడు. అప్పట్నుండి కోడిగుడ్లు ఆరోగ్యానికి మంచిదని, వాటిని అందరూ తినాలని స్కూళ్లు, రెస్టారెంట్లు, టీవీ, వేడుకల్లో చెప్తూనే ఉన్నాడు.

'టొమ్టాటో' చెట్టుని చూశారా?

టొమాటో చెట్లలని చూశాం, పొటాటో (ఆలుగడ్డ) చెట్లని చూశాం. కానీ ఈ టొమ్టాటో చెట్టేమిటా అనుకుంటున్నారా? కాస్త ఈ పేరుని గమనించండి... అవును! ఈ పేరులో ఉన్నట్టే టొమాటో చెట్టుని, పొటాటో చెట్టుని కలిపితే వచ్చిన చెట్టే టొమ్టాటొ చెట్టు. ఇంగ్లాండ్‌లోని ఇప్స్విచ్ నగరంలోని ఉద్యానవనంలో థాంప్సన్, మోర్గాన్ అనే ఇద్దరు విద్యార్థులు అంటు కట్టే పద్ధతి ద్వారా ఈ కొత్త రకం చెట్టును కనుగొన్నారు. ఈ టొమ్టాటో చెట్టుకు పైన టమాటాలు, కింద ఆలుగడ్డలు కాస్తాయి. ఇవి రుచిలో తేడాగా ఉన్నా, చూడ్డానికి మాత్రం వంద శాతం మామూలు టొమాటో, ఆలుగడ్డల్లానే ఉన్నాయంట.

కె.ఎక్స్.రాజు

ఒపెరాతో వేగవంతమైన బ్రౌజింగ్

మొజిల్లా ఫైర్‌ఫాక్స్, గూగుల్ క్రోమ్.. వంటి ప్రముఖ ఇంటర్నెట్ వెబ్ బ్రౌజర్లకు ఏ మాత్రం తీసుపోకుండా ఒపెరా (Opera) వెబ్ బ్రౌజర్ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరుచుకుంది. మొబైల్‌లోనూ తన హవా చాటుతోంది. తాజాగా ఒపెరా, ఐఫోన్ ఇంకా ఐప్యాడ్ లో కోసం తమ మొబైల్ అప్లికేషన్ బ్రౌజర్‌ను నవీకరించింది. యాపిల్ ఐఓఎస్ కోసం ఒపెరా అందుబాటులోకి తీసుకువచ్చిన ఒపెరా మినీ 8 బ్రౌజర్ ఐఫోన్ ఇంకా ఐప్యాడ్ యూజర్లకు మరింత సౌకర్యవంతమైన వెబ్ బ్రౌజింగ్‌ను చేరువచేస్తుంది. తాజాగా 26వెర్షన్‌తో లభ్యమౌతోన్న ఒపెరాను ప్రపంచ వ్యాప్తంగా 350 మిలియన్లకు పైగా ఉపయోగిస్తున్నారు. దీన్నిబట్టే ఈ బ్రౌజర్ సత్తా ఏమిటో తెలుసుకోవచ్చు. అదనపు అప్లికేషన్లు ఇన్‌స్టాల్ చేయకుండానే బ్రౌజర్‌లోనే అన్నీ చేసేయవచ్చు.

ఒపెరా బ్రౌజర్ గురించి క్లుప్తంగా...

★ ఎప్పుడు కొత్త ట్యాబ్ క్లిక్ చేసినా దాంట్లో థంబ్‌నెయిల్ బాక్సుల్లా వెబ్ సర్వీసులు ఓపెన్ అవుతాయి. అవి స్పీడ్ డయల్ అనేది తెలిసిందే. ఇది అన్ని బ్రౌజర్లలో ఉన్నప్పటికీ ఒపెరాలో మాత్రం దీన్ని నచ్చినట్టుగా మార్చేయవచ్చు. మొత్తం ట్యాబ్ విండోకి నచ్చిన ఫోటోని బ్యాక్‌గ్రౌండ్‌గా పెట్టుకోవచ్చు. స్పీడ్ డయల్‌లో ఎన్ని కాలమ్స్ ఉండాలో కూడా సెట్ చేయవచ్చు.

★ 'న్యూ ప్రైవేట్ ట్యాబ్' ద్వారా బ్రౌజింగ్ హిస్టరీ సేవ్ అవ్వకుండా సీక్రెట్ బ్రౌజింగ్ చేసుకోవచ్చు. స్పీడ్ విండోలు లేకుండా బ్లాంక్ ట్యాబ్ కావాలంటే Create Follower Tab ఉంది. ట్యాబ్ విండోను వేర్వేరు చోట్ల పెట్టుకునే వీలుంది. అరేంజ్ ఆప్షన్ ద్వారా ట్యాబ్‌ల వరుస క్రమాన్ని కూడా మార్చుకోవచ్చు.

★ బ్రౌజర్‌లో థీమ్స్ మార్చుకున్నట్టుగా బ్రౌజర్ లోగో, బ్యాక్‌గ్రౌడ్ ఇమేజ్‌లను కూడా పెట్టుకునే అవకాశం ఉంది. ట్యాబ్ విండోపై రైట్‌క్లిక్ చేసి కస్టమైజ్‌లోని అప్పియర్స్‌లో 'స్కిన్స్, ప్యానల్స్, టూల్‌బార్‌లు, బటన్స్'ని మనకు కావాల్సిన విధంగా మార్చుకోవచ్చు. 'స్పీడ్ డయల్స్' ట్యాబ్ విండోలోకి వెళ్లి కనిపించే ఇమేజ్‌లను బ్యాక్‌గ్రౌండ్‌గా పెట్టుకునే వీలుంది. వాటిని పీసీ డెస్క్‌టాప్ బ్యాక్‌గ్రౌండ్‌లా కూడా మార్చుకోవచ్చు.

★ అదనపు అవసరాలకు కుడివైపున డీఫాల్ట్‌గా కనిపించే టూల్‌బార్‌ను ఉపయోగించుకోవచ్చు. దీన్నే 'ప్యానల్' అంటారు. మరో ఆప్షన్ నోట్స్. దీనిద్వారా ముఖ్యమైన టెక్ట్స్ మేటర్‌ని కాపీ చేసి భద్రపర్చుకోవచ్చు. అక్కర్లేని టెక్ట్స్ ఫైల్స్‌ని 'ట్రాష్'లో వేయొచ్చు. అలాగే... ఒపెరా యునైట్‌తో కమ్యూనిటీగా ఏర్పడి ఫైల్ షేరింగ్, ఫొటో షేరింగ్ చేయవచ్చు. ప్రత్యేక మెస్సెంజర్‌తో ఛాటింగ్ చేయవచ్చు కూడా. బుక్‌మార్క్‌లను మేనేజ్ చేసుకోవడానికి ప్రత్యేక విభాగం ఉంది. డిలీట్ చేసిన బుక్‌మార్క్‌లను ట్రాష్‌లో పొందొచ్చు. గూగుల్, బింగ్, యాహూ, వికీపీడియా, ఆస్క్... సెర్చింజన్‌లను ఒకేచోట పొందొచ్చు. 'విండోస్' ఆప్షన్‌తో మొత్తం ట్యాబ్ విండోలను ప్యానల్ నుంచే మేనేజ్ చేయవచ్చు కూడా. ప్యానల్‌లోని ప్లస్ గుర్తుపై క్లిక్ చేసి అదనపు సౌకర్యాల్ని పొందుపరచవచ్చు. ప్యానల్‌లో మార్పులు చేయాలంటే 'కస్టమైజ్' చేయాలి. ప్యానల్‌లో అక్కర్లేని వాటిని అన్‌చెక్ చేసి తీసేయవచ్చు.

★ విడ్జెట్స్ రూపంలో ఫన్, గేమ్స్, రేడియో, మ్యూజిక్, సోషల్ వెబ్‌సైట్స్, సైన్స్, టైమ్ అండ్ డేట్ వంటి అదనపు సర్వీసుల్ని ఇన్‌స్టాల్ చేసుకుని వాడుకోవచ్చు. మ్యూజిక్‌లో వెబ్ రేడియో స్టేషన్లను వినొచ్చు. డెస్క్ టాప్‌పైనే గేమ్స్ ఆడుకోవచ్చు. ఆడేప్పుడు స్క్రీన్‌పై ఐకాన్లు, అప్లికేషన్లు అన్నీ కనిపిస్తూనే ఉంటాయి. 'యానిమేటెడ్ ఐ'తో తెరపై అందమైన రెండు కళ్లు ప్రత్యక్షమయ్యేలా చేయవచ్చు. 'బాస్కెట్‌బాల్ గేమ్‌'ని ఇన్‌స్టాల్ చేసి గోల్స్ వేయవచ్చు. 'డేట్ అండ్ టైం'తో తెరపై ఆకర్షణీయమైన తేదీ, సమయాన్ని చూపించే విడ్జెట్స్‌ని నిక్షిప్తం చేసుకోవచ్చు.

ఒపెరా మినీ ప్రత్యేకతలు :

మొట్ట మొదటి మొబైల్ వెబ్ బ్రౌజర్ ఒపెరా. నెట్‌వర్క్ నెమ్మదిగా ఉన్నప్పటికీ వేగంగా స్పందించగలదు. ఈ బ్రౌజర్‌లో నిక్షిప్తం చేసిన ప్రత్యేకమైన సాంకేతికత బ్రౌజింగ్ సమయంలో వెబ్‌సైట్‌ల ద్వారా అందే సమచారాన్ని బాగా కంప్రెస్ చేస్తుంది. దాంతో డేటా బిల్లులను తగ్గించుకోవచ్చు. ఆండ్రాయిడ్, యాపిల్, బ్లాక్‌బెర్రీ, సింబియాన్ వంటి అన్నిరకాల ఆపరేటింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఈ బ్రౌజర్ సపోర్ట్ చేస్తుంది. ఒపెరా బ్రౌజర్‌లో ఏర్పాటు చేసిన 'స్మార్ట్ పేజ్' ఫీచర్ ద్వారా సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్‌లు ఇంకా ఇతర వెబ్ పేజీలకు వేగంగా కనెక్ట్ కావచ్చు. ఇతర బ్రౌజర్‌లతో పోలిస్తే ఒపెరా మినీ బ్రౌజర్ పదోవంతు బ్యాండ్ విడ్త్ మాత్రమే ఉపయోగిస్తుంది. అలాగే బ్రౌజర్‌లో ఏర్పాటు చేసిన డేటా సేవింగ్ కాలిక్యులేటర్ ద్వారా డేటా వినియోగానికి సంబంధించి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. వ్యక్తిగత మెయిల్, సోషల్ నెట్‌వర్కింగ్, బ్యాంకింగ్ ఇలా అనేకమైన ఆన్‌లైన్ అకౌంట్‌లకు సంబంధించి మీరు ఉపయోగించే పాస్‌వర్డ్‌లన్నింటిని ఒక దగ్గర సురక్షితంగా స్టోర్ చేసుకునేందుకు పాస్‌వర్డ్ మేనేజర్ ఉంటుంది. డెస్క్‌టాప్ తరహాలోనే ఒక విండోలోనే అనేక వెబ్‌సైట్‌లు ఓపెన్ చేసుకునేందుకు అలానే అవసరమైన వెబ్ పేజీని సలువుగా ఎంచుకునేందుకు ట్యాబ్ బ్రౌజింగ్ సౌకర్యాన్ని ఈ బ్రౌజర్‌లో ఏర్పాటు చేసారు.

★ సరికొత్త నవీకరణలతో ఒపెరా మినీ బ్రౌజర్ యాపిల్ ఐఓఎస్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఒపెరా మినీ బ్రౌజర్ వేగవంతమైన, సురక్షితమైన వెబ్ బ్రౌజింగ్‌కు సహకరిస్తుంది.

★ టర్బో మోడ్ ఫీచర్ ద్వారా వెబ్‌సైట్ లుక్‌ను ఏ మాత్రం మార్చకుండానే డేటాను కంప్రెస్ చేసుకోవచ్చు. తద్వారా డేటా వినియోగాన్ని ఆదా చేసుకోవచ్చు.

★ వ్యక్తిగత మెయిల్, సోషల్ నెట్‌వర్కింగ్, బ్యాంకింగ్ ఇలా అనేకమైన ఆన్‌లైన్ అకౌంట్‌లకు సంబంధించి మీరు ఉపయోగించే పాస్‌వర్డ్‌లన్నింటిని ఒక దగ్గర సురక్షితంగా స్టోర్ చేసుకునేందుకు పాస్‌వర్డ్ మేనేజర్ ఉంటుంది.

★ 'స్మార్ట్ పేజ్' ఫీచర్ ద్వారా సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్‌లు ఇంకా ఇతర వెబ్ పేజీలకు వేగంగా కనెక్ట్ కావచ్చు. ఇతర బ్రౌజర్‌లతో పోలిస్తే ఒపెరా మినీ బ్రౌజర్ పదోవంతు బ్యాండ్ విడ్త్ మాత్రమే ఉపయోగిస్తుంది. అలాగే బ్రౌజర్‌లో ఏర్పాటు చేసిన డేటా సేవింగ్ కాలిక్యులేటర్ ద్వారా డేటా వినియోగానికి సంబంధించి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. మరిన్ని వివరాలకు www.opera.com చూడొచ్చు.

రచయిత సెల్ : 9490099219

■ సమీక్షలు



జీవన విధానంగా లౌకికవాదం

మతోన్మాదం పుట్టుక- పరిణామం - నివారణ, రచన: బిపన్ చంద్ర ఢిల్లీ చరిత్రకారుల తరపున, వెల: 50/- పేజీలు: 112, ప్రతులకు: ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

గత పాతిక సంవత్సరాల కాలంలో దేశంలో జరిగిన మతఘర్షణలు అనేకం. సహనంతో సహజీవనం చేసే భిన్న మతాల మధ్య మతం పేరుతో చిచ్చు రేపాయి మతోన్మాదశక్తులు. పరస్పరం కలిసి వుండే భిన్న మతాల నడుమ మతతత్వ భావాల్ని కల్పించారు. కనుక మతోన్మాదం పెనుప్రమాదకరంగా పరిణమించింది. లౌకికవిలువల పరిరక్షణ అవసరాన్ని గుర్తు చేయాల్సి వస్తుంది. ఈ పని చేయడంలో బిపన్ చంద్ర పుస్తకం 'మతోన్మాదం పుట్టుక - పరిణామం- నివారణ' ఎంతో ఉపయోగపడుతుంది. ఈ పుస్తకాన్ని ఆంగ్లం నుంచి తెలుగులోకి సూర్యదేవర మధుబాబు అనువాదం చేశారు. దీనిలో అయిదు అధ్యాయాలున్నాయి. మతతత్వ భావజాల దాడికి ప్రాతిపదికలు ఏమిటో సవివరంగా రాశారు. మతతత్వంపై రాజీలేని పోరాటం అవసరాన్ని లౌకికవాదులు గుర్తించాలని ఈ పుస్తకం మరింత స్పష్టంగా చెబుతుంది. ఒక భావజాలంగా మతతత్వం ఎంతటి ప్రమాదకరమో చర్చించారు. ఈ అయిదు అధ్యాయాలకు అనుబంధంగా మరో నాలుగు వ్యాసాలు ఇచ్చారు. మతతత్వం, ఛాందసవాదం మధ్య ఉండే సంబంధాన్ని విశ్లేషించారు.

కొన్నివిధులు, కొన్ని నిషిద్ధాలు అనే అధ్యాయంలో మంచి సూచనలు చేశారు. ముఖ్యంగా మతతత్వవాదుల మాటల గారడీకి లొంగిపోకుండా జాగ్రత్తపడాలని హెచ్చరించారు. భాషను ఉపయోగించడంలో మెలకువతో వ్యవహరించాలని కోరారు. హిందుత్వ అనడం కన్నా హిందూ మతతత్వం అనాలని సూచించారు. మతం కన్నా మతోన్మాదం ప్రమాదకరం. కాబట్టి మతాల్ని, మత సంప్రదాయాల్ని వ్యతిరేకిస్తూ మాట్లాడటం కన్నా, మతోన్మాదం దుర్మార్గం ఏమిటో వివరిస్తూ మీడియా వ్యవహరించాలన్న సూచన ఆమోదించదగింది. మెజారిటీ, మైనారిటీ మతతత్వం పట్ల ఎక్కడా మెతక వైఖరి ప్రదర్శించక్కర్లేదు. రెండిటిలో దేనినీ తక్కువగా చూడక్కర్లేదన్న అభిప్రాయాలు ఆమోదించదగ్గవి. జాతీయోద్యమం, స్వాతంత్ర్య పోరాటంలో మతోన్మాదశక్తులకు ఎలాంటి పాత్ర లేదని తేల్చిచెప్పడం వల్ల చాలామందికి జాతీయోద్యమంలో మతతత్వాన్ని పోషించే పార్టీల అసలు స్వరూపం అర్థమవుతుంది. నిజానికి బ్రిటిష్ వారి విభజించు పాలించు వ్యూహానికి మతతత్వశక్తులే ఉపయోగపడ్డాయని తేటతెల్లం చేస్తాయి అనుబంధ వ్యాసాలు. అందుకని భగత్‌సింగ్, గాంధీ పేర్లను మతోన్మాదశక్తులు వాడుకోడానికి ప్రయత్నిస్తే స్వాతంత్ర్యోద్యమంలో అవి నిర్వహించిన విచ్ఛిన్నకర పాత్రను ప్రపంచానికి తెలియజెప్పాల్సిన బాధ్యత లౌకికశక్తులదే. ప్రస్తుత పరిస్థితులలో లౌకికశక్తులు మరింత ఐక్యంగా, చైతన్యవంతంగా వ్యవహరించడం ద్వారానే మతోన్మాదుల ఎత్తుగడల్ని, కుట్రల్ని తిప్పిగొట్టడం సాధ్యం. ప్రజల్లో లౌకికభావాల్ని ప్రచారం చేయడమే కాదు, లౌకిక విలువలతో జీవించడం అలవరచాలి. దీన్ని ఒక ఉద్యమంగా స్వీకరించి అమలు చేయాలి.

- అశోక్‌కుమార్

కందపద్యం నుంచి కల్లోలగీతం దాకా...

'మానేరుగలగల'



మానేరు గల గల
వారాల ఆనంద్
వెల : 75/-, పేజీలు : 118
ప్రతులకు : వి.ఇందిర రాణి,
ఇం.నెం.8-4-641, హనుమాన్ నగర్,
కరీంనగర్-505001

తెలుగులో వచనం తగ్గిపోయిందని సాహిత్యవేత్తలు అంటుంటారు. బహుశా తెలంగాణాకు అది ఒక ప్రాతిపదికావసరం కూడా. కరీంనగర్ పరిధిగా పెట్టుకుని ఆ ప్రాంతపు రెండుమూడు తరాల సాహిత్యాన్ని పరిశోధనలను ఒక పునర్మిణా దృష్టితో ఆవిష్కరించిన పరిచయ వ్యాసాల సంపుటి వారాల ఆనంద్ "మానేరు గలగల" ఈ సంపుటి స్థూలంగా 'తెలుగు సాహిత్యాన్ని' పరిపుష్టం చేయడంలో కరీంనగర్ సాహిత్య సామార్థాన్ని అంచనా వేసింది.

కరీంనగర్ పరిధి, ఆ ప్రాంత సాహిత్యకారులు. ఇతరుల నుంచి కరీంనగర్ కేంద్రంగా వెలువడ్డ సాహిత్యం. కృషి ఇందులో గమనించ వచ్చు. ఈ విశ్లేషణలో చారిత్రకంగా గుర్తించ వలసిన అంశాలు కొన్ని ఉన్నాయి.

1. పి.వి.ని ప్రధానిగా లేక లోపలి మనిషి, సహస్రఫణ్ లాంటి సాహిత్యం నుండే అర్థం చేసుకుంటాం ఆనంద్ పి.వి. తెలంగాణా సాయుధ పోరాట కాలంలో రాసిన 'గొల్ల రామవ్వకథ' మంత్రగాడు కథ. స్వాతంత్ర్యానికి పూర్వం రాసిన బెంగాల్ కవాతు కథ (ఆంగ్లం) బ్లూసిల్క్ సారీ కథ. మంగయ్య అదృష్టం నవలికల నుంచి పరిచయం చేసారు. 2. 16 ఏళ్ల ప్రాయంలోనే సంస్కృత శ్లోక రచన చేసిన శతావధాని శిరిశిన హల్ కృష్ణమాచార్య 1929 నాటికే రచనలను వెలువరించారు. ఈ పరిచయంలోనే రచయిత తొలి తరం అంశాలు గమనించ దగినవి. 3. ఎముడాల అన్నమయ్యగా సాంబశివ కవిని. ఆధ్యాత్మిక సంప్రదాయ దృష్టితో ఆయన చేసిన సాహిత్యసేవను గుర్తు చేసారు. డా॥ వందన ఈ కవి రచనలపై పరిశోధన చేసిన అంశం ఒకటి గుర్తుకు తెస్తుంది. 4. గోలకొండ కవుల సంచికలో స్థానం సంపాదించిన వారు సుమారు 30కి పై కనిపిస్తారు గంగా లక్ష్మన్న, రాజేశ్వరరావు పరిచయం. ఆధునిక విప్లవ గీతం మల్లోజుల సదాశివుడు పరిచయం ఇందులో ఉంది.

పోతనతో బాటు రెండుస్కంధాలు భాగవతాన్ని తెనిగించిన ఎలగందల నారయ గూర్చి రాస్తూ "అలనాటి మనకవి ఎలగందల నారయ?" అని ప్రశ్నా చిహ్నంతో సంశయం వ్యక్తం చేసారు. అదే సమయంలో 'నారాయణ శతకం' నారాయణదేనన్నడా మలయశ్రీ వివరణను జత చేయడం ఒక సమగ్ర వివేచనకు నిదర్శనం.

'కందపద్యం నుంచి కల్లోలస్వరం దాకా' కరీంనగర్ సాహిత్య వ్యక్తిత్వాన్ని ఆనంద్ ఇందులో ప్రస్తావించారు.

- ఎం. నారాయణ శర్మ, 9849156588

పురస్కారాల కథకుని "వటపత్రశాయి" కథలు



వటపత్రశాయి, సింహ ప్రసాద్, పేజీలు: 240. వెల : 175/- రూపాయలు
ప్రచురణకు : శ్రీశ్రీ ప్రచురణలు, 401. మయూరి ఎస్టేట్స్
ఎమ్.ఇ.జి.11/650, కె.పి.హెచ్.సి. హైదరాబాద్-5000085.
సెల్ : 9849061668

ప్రముఖ కథా రచయిత డా॥ వేదగిరి రాంబాబుకు ఈ కథల సంపుటి సింహప్రసాద్ అంకితం చేశారు. ఈ కథా సంపుటిలోని కథలన్నీ పలు పోటీల్లో పురస్కారాలు పొందినవే. పాఠకాదరణా పొందినవే. పద్మశ్రీ డా॥ కొలకలూరి ఇనాక్, డా॥ పోరంకి దక్షిణా మూర్తి; డా॥ రాచ పాళెం చంద్ర శేఖరరెడ్డి గార్లు ఈ కథల సంపుటికి ముందుమాట(లు) రాసారు. దాదాపు ఇరవై కథలు...(కథానికలు) ఈ సంపుటిలో వున్నాయి. సింహప్రసాద్ 1973లోనే స్వాతిలో తొలికథ రాశారు. దాదాపు 263 కథలు 53 నవలలూ రాసారు. కొన్ని కవితలు, నాటికలు బహుమతులు పొందాయి. వటపత్రశాయి/గుప్పెడు/వంశ వృక్షం/ ఓ సీతకథ/మోడల్/పరబ్రహ్మ/ రోమ్ నీరో ఫిడేలు/ రేపింతే/ విష పరిష్కారం/ పాతనీరు/గాంధీతాత నవ్వాడు/పాయసం/తల్లీ నన్ను దలంచి/మనిషి దేవో భవా/ గబ్బిలం/ఆత్మ పదార్థం/ వానా వానా వల్లప్ప/ మనసా! తొందర పడకే/ ఒక యుద్ధం! ఒక సంధి-ఒక శాంతి... కథలు ఆరంభం నుండి చివరి దాకా పాఠకున్ని చదివింపజేస్తాయి.

కొలకలూరి ఇనాక్ గారు అన్నట్లుగా సింహప్రసాద్ కథలు...పక్కింటిలోనో, సొంతింటిలోనో జరిగినట్లుండే, జరిగేటట్లుండే విషయాలే పాత్రలకు ప్రాణ ప్రతిష్ఠ చేశాయి. కథను నడిపించటమే కదా!.. అందరికి నచ్చేటట్లు రాయటం.. వీరి ప్రత్యేకత. ఉద్యోగాల్లో మహిళా ఉద్యోగుల బాధలు? పురుష ఉద్యోగులతో నెగ్గుకు రాగలిగిన సీత కథ చాలా బాగుంది. "వట పత్రశాయి" కథ అమెరికలో ఉన్న భారతీయ జంటయైన సుభాష్-దివ్యాల అనురాగాల, వలపుల పంటగా... అద్భుతంగా రాసారు రచయిత.

చాలా కథలు... మధ్య తరగతి మనస్తత్వాన్ని చిత్రించాయి. పురస్కారాల వలలోంచి రచయిత బయటకు రావాలి. స్వ స్వరూపంలో కవి కనిపించాలి. రాచపాళెం ఇదే అన్నారు...

- తంగిరాల చక్రవర్తి, 9393804472

మహిళల సంవేదనల సమాహారం

అగ్నిశిఖ (ప్రరవే స్పందన)
పేజీలు: 132,
వెల: రూ. 80.
ప్రతులకు:
ప్రముఖ పుస్తక కేంద్రాలు

మహిళల మీద జరుగుతున్న హింసకీ, అత్యాచారాలకీ వ్యతిరేకంగా రచయిత్రుల, కవయిత్రుల స్పందనల్ని రికార్డు చేసిన పుస్తకం 'అగ్నిశిఖ'. ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక వెలువరించిన ఈ పుస్తకానికి కె.సుభాషిణి, డా॥ నళిని, కొండేపూడి నిర్మల, అనిశెట్టి రజిత, శివలక్ష్మి సంపాదకవర్గంగా వ్యవహరించారు. ఆడవాళ్ళని మనుషులుగా చూడండని చెబుతూ తమ లోపలి సంవేదనల్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు సృజనశీలురయిన మహిళలు. ఈ పుస్తకంలో కవితలు, కథలు, వ్యాసాలు, స్పందనలున్నాయి. స్త్రీ పురుష సంబంధాల్లో మార్పులు రావలసిన అవసరాన్ని రచయిత్రులు చర్చించారు. వ్యాసాల్లో సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పలుకోణాల్లో విశ్లేషించారు.

విస్మయానికి లోను చేసే కథన నైపుణ్యం



నవ్విన ధాన్యరాశి (కథల సంపుటి)
రచన: సి.వేణు, పేజీలు: 156, వెల: రూ. 116.
ప్రతులకు: సి.వేణుగోపాలరెడ్డి, సెల్: 099008 96123

చిన్నచిన్న వాక్యాలతో, వాతవరణాన్ని రక్తికట్టించే విధంగా దృశ్యమానం చేస్తూ రచించిన కథల సమాహారం 'నవ్విన ధాన్యరాశి'. సంఘటనల్నీ, సన్నివేశాల్ని కథలుగా మలచడంలో రచయిత సి.వేణు చూపిన నైపుణ్యం వల్ల కథల్ని అనాయసంగా చదువుతాం. కుటుంబ సంబంధాలు, మనుషుల స్వభావాలు, సామాజిక పరిణామాలు ఎలాంటి వైరుధ్యాలతో ముడిపడివున్నాయో చెప్పడానికి రచయిత ప్రయత్నించారు. వాస్తవాల వెనుక అంతరువుల్ని రూపుకట్టించారు. అందువల్ల మనకు తెలిసిన బతుకుల తాలూకు కనిపించని పార్శ్వాల్ని ఈ కథల్లో చూసి విస్మయం చెందుతాం. ఇక్కడే కథకుని సాఫల్యం ఇమిడివుంది. చకితుల్ని చేయగల నైజం వున్నందునే ఈ కథల్ని చదవాలి.

గమనిక

- సమీక్షకోసం పుస్తకాలు పంపే రచయితలు, ప్రచురణ కర్తలు రెండు ప్రతులు పంపించాలి.
- రచయితలే సమీక్షలు రాయించి పంపకూడదు.
- పుస్తకాల మీద సమీక్షలకు సంబంధించి సంపాదకులదే తుది నిర్ణయం. ఈ అంశంపై ఉత్తర ప్రత్యుత్తరాలకు, ఫోన్లలో సంప్రదింపులకు తావు లేదు.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం
సంచిక, ప్లాట్ నెం.21/1,
ఎం.హెచ్.భవన్, ఆజమాబాద్,
ఇండస్ట్రియల్ ఏరియా,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500030.

ఒక తడిగీతం

ఇలాంటి రోజొకటి
ఇంత తొందరగా వొస్తుందనుకోలేదు
భారమైన హృదయంతో
దిగులుదారుల వెంట ఒంటరినై వెళ్లాల్సివొస్తుందని
అసలే మాత్రం ఊహించలేదు
నిన్న మొన్నటి దాకా తన పదముద్రలతో
పరిమళభరితమైన వాడు
ఇవ్వాళ ధవళవస్త్రం కప్పుకుని
అస్త్రశస్త్రాలను వొదులుకుని
అంతిమ యాత్రకు సిద్ధమయ్యాడు
సముద్ర తీరంలో రంగురంగుల గవ్వల్ని
ఏకాగ్రత దృష్టితో ఏరుకొచ్చినట్టు
నా కోసం మంచి కవిత్వాన్ని సంచిలో వేసుకొచ్చేవాడు
ప్రేమతత్త్వంతో రాయడమెలాగో నేర్పించిన వాడు
నా మస్తిష్కంలోంచి రూపుదిద్దుకున్న కావ్యాన్ని
ఆవిష్కరించకుండానే నిష్క్రమిస్తున్నాడు
ఇంకా సాగర తీరాల్లో మనం మాట్లాడుతున్నట్లేవుంది
ఇవాళెందుకో గుండె గొంతుకి అడ్డం పడుతోంది
నువ్వొకారణ జన్ముడవనీ
కర్మ సిద్ధాంతానికి అతీతుడవనీ అనుకున్నాను
మరణం నీకూ అనివార్యమనీ
అది మన అపూర్వ స్నేహ బంధాన్ని
చెట్టు నుంచి కాయను వేరుచేసినట్టు చేసి
పరిహాస మాడుతుందను కోలేదు
విధ్వంసక ముఖచిత్రంతో
విషాద సంచికను విడుదల చేస్తుందనుకోలేదు
చెల్లాచెదురుగా పడివున్న నా అక్షరాలకు
ఆకృతినిచ్చే నీలాంటి ప్రకృతి ప్రేమికుడు
మళ్లీ నాకీ జన్మలో దొరకడు మిత్రమా
సాయంత్రాలకు, సాగర తీరాలకు
నువ్విక రా(లే)వన్న నరకమంత నిజాన్ని
ఏ మొహం పెట్టుకుని చెప్పను?!
నువ్వులేని ఈ వర్తమానమే నెత్తుటి గాయమై
మనసును తునాతునకలు చేస్తుంటే
భవిష్యత్తు బడబాగ్నిలా మారి
నన్ను బలి తీసుకోకుండా వుంటుందా?!
క్షమించు నేస్తమా!
నాకు యిప్పుడప్పుడే మరణించాలని లేదు
బతుకును అర్థాంతరంగా ముగించాలని లేదు
జనన మరణాల, చక్ర భ్రమణాల
సంవాద, సంవేదనలను
కవితాక్షరాలుగా మార్చి, ఏర్చికూర్చి
సరికొత్త స్నేహకవితా సంపుటిని
సమాజానికి నీ స్మృతిగా సమర్పించాలని వుంది
అరుదైన వ్యక్తిత్వం వున్న నీకు
అశ్రునయనాలతో అంకిత మివ్వాలని వుంది.

- సాహిత్య ప్రకాశ్, 9703287555

ప్రతిరోజు జీవితమే

ఎప్పట్లానే
సూర్యుడు ఒక ఉదయాన్ని తెచ్చి చేతిలో పెట్టాడు
తలుపు తెరవగానే ఇంటిముందు నిలబడ్డ పూలమొక్క
ఓ నవ్వు నవ్వి నాలుగు పూలు తెచ్చి దోసెట్లో పోసింది
ఆ రోజు మొదలైంది బుల్లి బుల్లి అడుగుల్లో
మధ్యాహ్నవేళ
వడ్డిస్తున్న ఆమె కళ్ళలోకి ఒక చిరునవ్వు మెరుపు
దూసికెళ్ళింది
ఆమె దాన్ని భద్రంగా చీర చెంగున దాచుకుంది
బహుశ అప్పుడప్పుడు విప్పి చూసుకుంటుందేమో
సాయం నీరెండ వేళ
ఆకుల పాదాలపై సంధ్యారాగపు పారాణి చూస్తూ
రేపటి కలని శృతిచేస్తూ
వాన చినుకుల్లా రాలిపడే క్షణాలకి తీపిరంగులు
అద్దుతూ
టీ కప్పుతో సరససల్లాపాలు
దేహం మీద ధవళవస్త్రంలా చుట్టుకున్న వెన్నెల
నక్షత్రాల పూలతోట నింగికెగిరి
నేలకొక చల్లని రాత్రిని కానుగ్గా తెస్తుంది
మనుషులు జీవితాన్ని ప్రేమిస్తారో
జీవితం మనుషులను ప్రేమిస్తుందో గానీ
జీవితాన్ని ప్రేమించేవాడికి
నిజంగా జీవించేవాడికి
ప్రతిరోజూ జీవితమే

- బండి సత్యనారాయణ, 83318 41965



‘చెత్త’ రువులు

ఏదైనా ఒక వస్తువుని విడిగా చూస్తే ఏ భావమూ కలగదు. అది ఒక బొమ్మ అంతే! అదే వస్తువు పాడైపోయిన తర్వాత చూస్తే ఇదెందుకు పనికొస్తుంది చెత్త బుట్టలో పడేయడానికి తప్పితే... అనిపిస్తుంది. కానీ ఫ్రెంచ్ ఆర్టిస్ట్ బెర్నార్డ్ ప్రాస్‌కు మాత్రం పాడైపోయిన వస్తువుల్లో, తీసేసిన బట్టల్లో ఎంతో కళాత్మకత కనిపిస్తుంది. వాటన్నిటినీ ఒక చోట చేర్చి కళాఖండాలను తయారు చేస్తాడు. పైన ఫొటోల్లో కనిపించేవన్నీ ప్రాస్ అలా తయారు చేసినవే. తీసేసిన జీన్స్, పిల్లలు విరగ్గొట్టిన బొమ్మలు, ఇంట్లో విరిగిపోయిన వస్తువులు, చెత్త, చెదారం... ఇలా ఏది దొరికితే దాన్ని జాగ్రత్తగా తీసి ఇలా తయారు చేస్తాడు.

ఊహ కాదు... నిజం!

ఓ అందమైన పే...ద్ద... రాజకోట, దాని చుట్టూ ఉద్యానవనం, ఆ ఉద్యానవనం చుట్టూ నీళ్ళు. అలాంటి ప్రదేశాల్లో సాయంత్రం వేళల్లో విహారానికి వెళ్తే... ఆహా! అనిపిస్తుంది కదూ. ఇదేదో సినిమాల్లో తప్పితే నిజంగా కనిపిస్తాయా అనుకుంటున్నారా? అలాంటి సందేహమేమీ పెట్టుకోకండి. ఎందుకంటే నిజంగానే అలాంటి రాజకోటలు, భవనాలు, ఆలయాలు ఉన్నాయి. ఆంగ్‌కోర్ వాట్ దేవాలయం, బంగ్లాదేశ్‌లో నేషనల్ అసెంబ్లీ బిల్డింగ్, ఫ్లోరిడాలోని హోమ్ ఆఫ్ చార్లెస్ సెయిగర్ –మియామి, జపాన్‌లోని మాట్సుమోటో కోట, డెన్మార్క్‌లోని ఈగెస్కోవ్ కోట, బీజింగ్‌లోని ఫోర్బిడెన్ సిటీ, ఇంకా ఫ్రాన్స్, నెదర్లాండ్, స్వీడన్ దేశాలో... ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. వాటిలో కొన్ని...